honeybee.org

సంపుటి 5 సంచిక 1 జులై - ఆగస్టు 2016

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org



## తెలంగాణ ప్రథమ మూలికా వైద్యుల సమావేశం

యువతను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళిస్తున్న

## కొమ్మూరి విజయ కుమార్

కడప జిల్లాలో జరిగిన

## 19వ చిన్న శోధయాత్ర - జ్ఞాన యాత్ర



# అడవి అందంగా ఉండదా?



ఒకానొక కాలంలో 'సరస్వతి' అనే రాణి ఉండేవారు. ఆమె పేరుకు తగ్గట్టుగానే తెలివైనదే కాక ప్రకృతి పట్ల ప్రేమ, గౌరవం కలది. ఆమె రాజ్యం శివారులో బంజరు భూమి ఉండేది. దానిని ఆమె ఏదైనా ఒక మంచి కార్యానికి ఉపయోగించాలని నిర్ణయించింది. సరేనని ఆ ప్రాంతానికి తోటమాలులను పిలిపించి ఆ ప్రదేశాన్ని అందమైన ఉద్యానవనంగా మార్చే పోటీలు ఏర్పాటు చేసింది. ఆ ప్రాంతాన్ని చిన్న చిన్న భాగాలుగా చేసి వారిలో ఒక్కొక్కరికి ఒక భాగం అప్పజెప్పి అక్కడ తాను ప్రకృతిలోని రంగులను చూడదలచుకున్నాను అని చెప్పింది. తనకి నచ్చిన తోటకి బహుమతి ఇస్తానని ప్రకటించింది. వారందరికీ ఒక సంవత్సర కాలం గడువచ్చి, తర్వాత తానొచ్చి చూసి వాటిలో బాగున్న దానికి బహుమతి ప్రకటించింది. ఆమె నిర్ణయం అందరినీ ఆశ్చర్య పరిచింది. పిచ్చి నిర్ణయం అనుకున్నారు కొందరు. ఆమె ఆవిధంగా విజేతని నిర్ణయించడానికి కారణాలేమిటని కొందరు అడిగారు. దానికామె "అందరూ చాలా శ్రమించి ఈ ప్రాంతాన్ని నందన వనంగా మార్చారు. ఒకరు ఎర్ర గులాబీలతో నింపేస్తే మరికొందరు మల్లెల సువాసన గుభాళించేలా చేశారు. మరికొందరు బంతిపూల సోయగాలతో నింపేశారు. కానీ, నేను విజేతగా ప్రకటించిన తోటమాలి ఎందుకూ పనికిరాని తన భూమిలో ఎంతో శ్రమించి రకరకాల గడ్డి, పొదలు, చెట్లు, అడవిలోనుంచి తెచ్చి పెంచాడు. దానిని రకరకాల రంగులతో నింపడమే కాక, అతను తెచ్చి నాటినవన్నీ అంతరించి పోతున్న జాతులు" అన్నది. అది విని అంతా ఆలోచనలో పడ్డారు. అడవి అందంగా ఉండదా?

– హనీబీ 11(2)–2000

సంపుటి-5 సంచిక - 1

# పల్లెసృజన

జులై-ఆగస్టు 2016

## ఈ సంచికలో...


- పేడతో తొట్లు, పిడకలు, దుంగల తయారీ - 3
- అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు - 7
- 'సృష్టి సమ్మాన్-2016' పురస్కార విజేతలు - 9
- రెండుబోర్లకు ఒకే మోటరు జ్ఞానం రైతులకు అంకితమిస్తున్న పుల్లారెడ్డి - 13
- మారుమూల 'తెలంగాణ మూలికా వైద్యుల' అద్భుత సమ్మేళనం - 18
- 19వ చిన్న శోధయాత్ర - 23
- రైతు నేస్తం, ప్రకృతి నేస్తం, ప్రజా నేస్తం కొమ్మూరి విజయ కుమార్ - 26
- స్పందన - 32


కవర్ లోపలి పేజీల్లో ....

అడవి అందంగా ఉండదా?-హనీబీ కథ,

రైతుల కోసం రైతులు తయారు చేసిన సేంద్రియ పురుగు మందులు

మధ్య పేజీలో :

'ఇగ్నైట్-2015' లో బహుమతి పొందిన చిన్నారుల ఆలోచనలు

ప్రతి పేజీలో అబ్దుల్ కలాం గారి సూక్తులు


### సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్ములమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్ములమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్ సిద్ధు



ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్- 500 094.

ఫోన్ :
040-27111959
98660 01678

E-mail :
president@pallesrujana.org

Visit at :
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com


## HoneyBee Regional Collaborators & Publications


**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in


Printed, Published and Owned by **Brig. Pogula Ganesham,** Chief Editor, Published from 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678 and Printed at **M/s Narendra Graphics**, 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904, Editor Sri **J. Sesimohan.**

# జీవ పదార్థాన్ని సద్వినియోగం చేస్తున్నామా ?

మొక్కలు పెరిగి ఫలాలు ఇవ్వాలంటే వాటికి కనీసంగా కావలసినవి సూర్యరశ్మి, నీరు, పోషకాలు. సూర్యరశ్మి ఏకమార్గంగా వస్తుంది. నీరు, పోషక పదార్థాలు ఇవి ఒక వలయంలో లభిస్తూ ఉంటాయి. సూర్యరశ్మి ద్వారా భూతలంపైన వున్న నీరు ఆవిరిగా మారి మేఘాలుగా పయనించి, వర్షం కురిపించి తిరిగి భూతలానికి చేరుకుంటాయి. దీన్ని 'నీటి వలయం' అంటారు. అలాగే పోషక పదార్థాలు కూడా ఈ వలయ పద్ధతిలోనే మనకు లభిస్తాయి. అంటే వేర్వేరు రూపాల్లో ఉన్నా పోషక పదార్థాల మొత్తం మాత్రం మారదు. వాటి స్థితి మాత్రమే మారుతుంది. ఒక ఆకు భూమిలోని పోషకాలతో పెరిగి తిరిగి భూమిలో కలిసి పోషకాలను భూమిలో సమకూరుస్తుంది. ఈ వలయాన్ని 'ఆహార వలయం' సాధ్యం చేస్తుంది. ప్రతి రైతు ఈ పోషకాల వలయం గురించి కొంచెం అవగాహన కల్గి ఉండటం ఆయనకు, మన వాతావరణానికి, పంట భూములకు ఎంతో అవసరం.

కడప జిల్లాలో 19వ చిన్న శోధయాత్రకి వెళ్ళినపుడు రైతు 'విజయ కుమార్' కలిసారు. ఆయన కథ మార్గదర్శకత్వంగా ఉంటుందని ఈ సంచికలో ప్రచురిస్తున్నాం. పైన చెప్పిన పోషక వలయం గురించి మాకు సరళ భాషలో క్షుణ్ణంగా వివరించారు విజయ కుమార్ గారు. సగటున మనం ఏ చెట్టునుండైనా 5 శాతం ఫలాన్ని మాత్రమే వాడుకుంటాం. మిగతాదంతా వదిలేస్తాం. ఉదాహరణకు ప్రత్తి చెట్టు నుండి ప్రత్తిని కోసుకుని, చెట్టును వదిలేస్తాం, తగలబెడతాం లేక పొయ్యిలో కట్టెలుగా వాడుకుంటాం. పోషక పదార్థాలు భూమినుంచి చెట్టు పెరగడానికి తోడ్పడి, ఆ తర్వాత ఉష్ణంగా మారి బూడిదగా భూమిలో కలిసిపోయాయి. కాని ఏ పంట పొలం లోంచి వచ్చాయో ఆ పొలానికి తిరిగి వెళ్ళలేదు. ఒక హెక్టారుకు 10 వేల ప్రత్తి మొక్కలుంటే ఒక్కొక్క చెట్టు బరువు 2 కిలోలు అనుకుంటే, 20 వేల కిలోల జీవ పదార్థం ఆ భూమిలోనుండి బయటకు పోయి ఉష్ణంగా, బూడిదగా మారింది. ఈ 20 వేల కిలోల జీవ పదార్థానికి ఉపయోగ పడిన పోషకాలు కూడా వాటితోపాటు ఆ హెక్టారు భూమినుండి తరలిపోయాయి. ఈ పోషక వలయం అసంపూర్తిగా ఉండిపోయింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారిక గణాంకాల ప్రకారం 2015-16 సంవత్సరంలో 23.57 లక్షల హెక్టార్లలో ప్రత్తి వేసినట్టు అంచనా వేశారు. పై లెక్కప్రకారం ఒక హెక్టారుకు 20 టన్నులు (20,000 కిలోలు) జీవపదార్థాన్ని మనం పొలం నుండి వేరు చేస్తూ, మొత్తం రెండు రాష్ట్రాలలో ఒక సంవత్సరంలో 461 కోట్ల టన్నుల జీవ పదార్థం మనం దూరం చేసుకుంన్నాం. ఇది ఒక్క ప్రత్తి మొక్కల విషయంలోనే కాదు, వేరుశనగ, కంది, మిరప, శనగ, పెసర పంటలన్నీ ఇలాగే కోట్ల టన్నుల జీవ పదార్థాన్ని భూమినుండి ప్రతి పంటకి వేరు చేస్తున్నాం. ఇది ఎంతవరకు సమంజసం! దీనివల్ల మన సాగు భూములకు, మన పంటకు, రైతు ఆర్థిక పరిస్థితికి, దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి పరిణామాలుంటాయన్నది నిశితంగా పరీక్షించాలి. శాస్త్రజ్ఞులు ఇంతవరకు ఈ విషయంపై ఎక్కువగా చర్చించినట్టుగాని, పరిశోధనలు చేసునట్లుగాని అందుబాటులో వున్న సైన్సు గ్రంథాలలో అంతగా కనిపించటం లేదు.

అయితే రైతు విజయ కుమార్‌కు సమస్యే కాదు, పరిష్కారం కూడా తెలుసు. ఉదాహరణకి ఆయన ప్రత్తి చెట్టును చిన్న చిన్న ముక్కలుగా ఒక అంగుళం పొడవు చేసి, ఆ ముక్కలను ఒక గుంత (దిబ్బ)లో వేసి కొన్నిరోజులు మురగబెడితే అది మంచి ఎరువుగా మారుతుంది. ఆ తర్వాత ఆ ఎరువును ఏ భూమిలోనుంచి వచ్చిందో అందులోనే వేస్తే పోషక వలయం కొంతయినా పూర్తవుతుందని ఆయన అంచనా. ఈ పద్ధతి ఎంతో సమంజసంగా, అర్థవంతంగా ఉంది. ఇలా చేయడంలో రైతుకు ఖర్చు తక్కువ, తన భూమిలోని పోషకాలను తిరిగి కొంత వరకైనా కాపాడుకోవడంలో కృతకృత్యుడవుతాడు అనడంలో సందేహం లేదు. విజయ కుమార్ అడిగిందల్లా ప్రత్తి లాంటి చెట్టున చిన్న ముక్కలుగా చేయడానికి ఒక యంత్రం కావాలన్నాడు, పల్లెసృజన ఆనందంగా గ్రామీణ ఇన్నోవేటర్లతో సంప్రదించి ఈ యంత్రాన్ని తయారు చేయిస్తున్నది. బహుశా మీరు ఈ సంచిక చదివేటప్పటికి కటింగ్ మిషన్ విజయ కుమార్ గారి పొలానికి చేరుకొని ఉంటుంది.

పోషకాల వలయం గురించి అవగాహన రైతులకుంటే వారి పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని, వారి పంట పొలంలో పోషక పదార్థాలు సహజంగా వృద్ధి చెందుతాయని విజయ కుమార్ ద్వారా తెలుసుకున్న జ్ఞానంతో పల్లెసృజనకు కలిగిన విశ్వాసం. రైతులు ఈ విషయంపై చర్చిస్తారని, ప్రయోగాలు చేస్తారని, వారి ఆలోచనలు, అనుభవాలు పల్లెసృజనతో పంచుకుంటారని మనసారా ఆశిస్తున్నాం.

ఈ పోషక వలయంపై సుభాష్ పాలేకర్, జపాను సహజ వ్యవసాయ శాస్త్రవేత్త 'ఫ్యుకువోకా' ఎన్నో అభిప్రాయాలు వెలిబుచ్చారు. వీటన్నిటినీ క్రోడీకరించి, శాస్త్రీయ జ్ఞానంతో జోడించి, పాఠకుల అభిప్రాయాలను పరిగణించి త్వరలో ఒక సమగ్ర అభిప్రాయాన్ని పాఠకులకు పల్లెసృజన ద్వారా అందిస్తామని తెలియజేస్తున్నాము.



భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

**కష్టాలు నిన్నుసాధించటానికి రాలేదు.... నీ శక్తి సామర్థ్యాలను బయటకు తీసి నిన్ను నీవునిరూపించుకునేందుకే వచ్చాయి...**

# పేడతో తొట్లు, పిడకలు, దుంగల తయారీ



## గుజరాత్‌కు చెందిన ఇన్నోవేటర్లు తయారు చేసిన సరికొత్త యంత్రాలు

పేడ లేని గ్రామం లేదు. పేడను ప్రజలు ఎన్నో రకాలుగా వాడుకుంటారు. ముఖ్యంగా పిడకలు చేయడం. ఈమధ్య జీవామృతం తయారీలో పేడను ఉపయోగిస్తున్నారు. అయితే గుజరాత్‌కు చెందిన ఇన్నోవేటర్లు పేడతో పూలతొట్లు తయారు చేయడానికి, సులభంగా పిడకలు చేయటానికి, శ్మశానాల్లో కట్టెల బదులు శవాలను కాల్చేందుకు పేడ దుంగలు తయారు చేసేందుకు యంత్రాలను కనుగొన్నారు. వీటి వివరాలను పాఠకుల కోసం అందిస్తున్నాం.

**పేడతో నర్సరీ తొట్ల తయారీ:**

నర్సరీలలో మొక్కలు పెంచటానికి పూర్వం సాంప్రదాయంగా మట్టి తొట్టెలను వాడేవారు. మట్టి పాత్రలలో మొక్కలకు పోసిన నీరు సూక్ష్మ రంధ్రాల ద్వారా గాలిలో కలిసి మొక్క కూడా ఆరోగ్యంగా పెరిగేది. మట్టి తొట్ల తయారీ, వాడకం తగ్గిపోయింది. ప్లాస్టిక్ కవర్ల వాడకం ఇప్పుడు ఎక్కువైపోయింది. ప్లాస్టిక్ వాడటం వలన అది భూమిలో కలిసిపోక పోవటం, ప్లాస్టిక్ కవర్లలోని మట్టిలో పోసిన నీరు బయటకు వెళ్లే మార్గమే లేక అక్కడక్కడే వుండటం వల్ల మొక్కలకు ఆరోగ్యకర వాతావరణం అందే అవకాశం లేక మొక్కలు సరియైన పోషకాలతో పెరిగే అవకాశం తక్కువ. పైగా ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యం కూడా పెరిగిపోతున్నది. మొక్క మొలకెత్తిన తర్వాత పెరిగేకొద్దీ వాటి వేరు వ్యవస్థ విస్తరణకు ప్లాస్టిక్ ప్రతిబంధకంగా వుంటుంది. ఇన్ని రకాల ఇబ్బందులను అధిగమించటానికి వీటికి ప్రత్యామ్నాయంగా 'పరేష్ పంచాల్' అనే అహమ్మదాబాద్‌కు చెందిన ఇన్నోవేటర్ ఆవు పేడ మరియు వ్యవసాయ వ్యర్థాలను మేళవించి నర్సరీ



వర్షం వచ్చినపుడు పక్షులన్నీ నీడను వెతుక్కుంటాయి కానీ గద్దలు వర్షానికి తడవకుండా మేఘాల పైనుంచి ప్రయాణిస్తాయి.



తొట్టెల తయారీకి ఒక యంత్రాన్ని రూపొందించాడు. ఈ తొట్టె మట్టిలో కలిసిపోవటమే కాక, దీనివల్ల రెండు రకాల లాభాలున్నాయి. మొదటిది, ప్రధానమైనది పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం తగ్గిపోతుంది. రెండవది ఇదే ఆ మొక్కకు ఎరువుతో పాటు, క్రిమి సంహారిణిగా కూడా పనిచేస్తుంది. మట్టితో చేసే తొట్లను కాల్చటానికి మళ్ళీ కట్టెలు వాడాల్సిన అవసరం వుంటుంది, అవి పగిలిపోయినా మళ్ళీ మట్టిలో కలవాలంటే చాలా రోజులు పడుతుంది. కానీ ఈ పేడ తొట్లు మట్టిలో త్వరగా కలిసిపోతాయి.

ఈ యంత్రాన్ని సులభంగా వాడుకోవచ్చు. దీనితో మూడు రకాల సైజుల్లో తొట్టెలను తయారు చేసుకోవచ్చు. చిన్నవి – 3.2 అంగుళాల వెడల్పు, 3.5 అంగుళాల ఎత్తు, 0.4 అంగుళాల మందంతో చేసుకోవచ్చు. మధ్యరకం తొట్టెలు – 6 అం. వెడల్పు, 5.2 అం. ఎత్తు, 0.6 అం. మందంతోను, పెద్ద తొట్టెలు – 7 అం. వెడల్పు, 8 అం. పొడవు, 0.7 అం. మందంతో తయారు చేసుకోవచ్చు.



ఎలాంటి ఇంధనము, కరెంటు అవసరం లేకుండా కేవలం మానవ శక్తితోనే పనిచేసే ఈ యంత్రంతో గంటకి 100 వరకు తొట్టెలను తయారు చేసుకోవచ్చు. రూ. 18000 వరకు ఖరీదు చేసే ఈ యంత్రం ఆర్డరు చేసిన 15 రోజుల్లో అందజేయ బడుతుంది.

కావలసిన వారు "దేవాంగ్ కంబాటియా, సెల్ నెం. 0904646555 లేదా 9824079439లలో సంప్రదించి పొందవచ్చును.

**పిడకల తయారీ యంత్రం:**

పూర్వం పశుగ్రాసమున్న ప్రతి రైతు కుటుంబం తప్పనిసరిగా పిడకలను తయారు చేసుకునేది. వీటిని వంట చెరుకుగా విరివిగా వాడేవారు. మరీ ముఖ్యంగా వీటిని పాలు కాచేందుకు తప్పనిసరిగా వినియోగించేవారు. అందుకేనేమో నాటి పాలు, పెరుగు, మజ్జిగల రుచి ఇప్పటికీ మధుర స్మృతిగానే ఉండిపోయింది. మారుతున్న కాలం దృష్ట్యా పిడకలు తయారు చేసేవారు కరువవటంతో వాటిని దాదాపు మరచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇక ధార్మిక కార్యక్రమాలు, యజ్ఞ యాగాదుల్లో వీటి ఉపయోగం తప్పనిసరి. ఇవి ప్రస్తుతం లభించక 'ఆన్‌లైన్'లో కొనే పరిస్థితి దాపురించింది. ధాన్యం నిలువ చేసే గాదెలలో కూడా పిడకలను వాడటం కొన్ని ప్రాంతాలలో జరిగేది.

ప్రస్తుత తరం పేడ పిసికి పిడకలు చేయటం



నేను గెలవాలి అని గట్టిగా నిర్ధారించుకుంటే ఎప్పటికీ ఓడిపోవు.



నామోషీగా భావిస్తున్న ఈ సమయంలో గుజరాత్‌కి చెందిన 'మన్సుక్ భాయ్ ప్రజాపతి' ఈ పిడకలు తయారు చేసేందుకు ఒక చిన్న యంత్రాన్ని రూపొందించాడు. దీనితో ఒకే సైజు, ఒకే మందంలో గల పిడకలు తయారు అవుతాయి. కేవలం మానవ శక్తితోనే పనిచేసే ఈ యంత్రం వివిధ రకాల అచ్చులు (డై) ఉపయోగించి రెండు మూడు అంగుళాల వ్యాసార్ధం కల పిడకలను తయారు చేసుకోవచ్చు. పేడలో వ్యవసాయ వ్యర్థాలను కలపడం ద్వారా ఇవి బాగా మండటమే కాకుండా ఎక్కువ సెగ కలిగి వుంటాయి. వ్యర్థాలను కూడా వృధాగా పోకుండా వాడుకోవచ్చు.

పూజలకి, యజ్ఞ యాగాదులకి పనికి వచ్చేలా పేడలో గుగ్గిలము, కర్పూరము, చందనములను కలిపి ప్రత్యేకమైన పిడకలను కూడా తయారు చేసుకోవచ్చు. వీటిని కలపటం వల్ల మంచి సువాసనను ఇవ్వటమే కాకుండా దోమలను కూడా పారద్రోలే స్వభావం కలిగి వుంటాయి. అర అంగుళం మందంలో గల పిడకలను తయారు చేసుకోవచ్చు. ఒక యంత్రం ఖరీదు రూ. 6,000లు



వుంటుంది. ప్యాకేజింగు, రవాణా ఖర్చులు, పన్నులు అదనం. ఆర్డరు చేసిన 20 రోజులలో ఈ యంత్రం అందజేయ బడుతుంది.

కావలసిన వారు 'గుజరాత్ గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్ అగ్‌మెంటేషన్ నెట్‌వర్క్' టెలిఫోన్ నెం.: 079–26760398లో సంప్రదించి పొందవచ్చు.

**పేడతో దుంగల తయారీ:**

సనాతన హిందూ ధర్మం ప్రకారం పార్థివ శరీరాన్ని (శవాన్ని) కాల్చటం మన సాంప్రదాయం. దీనికై కట్టెలు కాని, కరెంటు కాని, ఎల్‌పిజి గ్యాస్‌ను కానీ వాడటం జరుగుతూ వుంటుంది. కాలక్రమేణా వీటి ధరలు పెరిగిపోవటమే కాక, పర్యావరణానికి కూడా హాని జరుగుతూ వుండటాన్ని గమనించి అహమ్మదాబాద్‌కు చెందిన 'మన్సుఖ్‌భాయ్ ' అనే ఒక రైతు ఆవు పేడతో చేసిన దుంగల లాంటి కట్టెలను తయారు చేయటం ప్రారంభించాడు.

దానికి తగ్గట్టుగానే ఈయన పేడతో గడ్డిని కలిపి ఈ



మనిషికి జీవితంలో కష్టాలు కూడా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలోనే సుఖాలను గురించి ఆలోచిస్తాడు.





దుంగలను తయారు చేశాడు మన్సుఖ్ భాయ్. మామూలు కట్టెలు ఇతర పదార్థాలకన్నా ఇది చవక. వీటిని తయారు చేయటానికి ఈయన ఒక చిన్న యంత్రాన్ని రూపొందించాడు.

ముందుగా పేడలో, గడ్డి లేదా పొలాల్లో లభించే వ్యర్థాలను కలిపి ఈ యంత్రంలో వేస్తే ఒక 'మర' లాంటి పరికరం సహాయంతో 'దుంగ' రూపంలో బయటికి వస్తుంది. మన అవసరాన్ని బట్టి ఏ సైజులనా ఈ దుంగలను తయారు చేసుకోవచ్చు. వీటిని ఎండబెట్టిన తర్వాత కట్టెలకు ప్రత్యామ్నాయంగా శవాలను కాల్చడానికి వాడుకోవచ్చు.

ఈ యంత్రం వలన గోశాలల్లోని పేడకు విలువను పెంచి ఎక్కువ ఆదాయం పొందే అవకాశముంది. ఈ యంత్రాన్ని నడపటం చాలా సులభం. స్త్రీలు కూడా సునాయాసంగా నడుపవచ్చు. మన అవసరానికి తగ్గట్టు దుంగల సైజును మార్చుకోవచ్చు. వీటిని చిన్న ముక్కలుగా చేసి పొయ్యిలో వంట చేసుకోవటానికి ఉపయోగించుకుంటే వంటల రుచిలో కూడా తేడా వుంటుంది. ఆరోగ్యానికి మంచిది. వీటిని హోమ గుండాలలో కూడా వాడుకోవచ్చు. చెట్లను సంరక్షించుకొని పనికి రాని వ్యర్థాలతో పేడను కలిపి చేసుకోవటం వల్ల పర్యావరణం కూడా కొంతవరకు కాపాడ బడుతుంది. దీనివల్ల ఉత్పన్నమయ్యే వేడి చాలా ఎక్కువగా (3522 కేసిఎల్ /కెజి.) ఉంటుంది కనుక పరిశ్రమలలో కూడా వాడుకోవచ్చు. ఒక హెచ్‌పి మోటార్‌తో పనిచేసే ఈ యంత్రం సహాయంతో గంటకి (3అంగుళాలు x3 అంగుళాలు x3 అడుగుల) 50 నుంచి 60 వరకు దుంగలను తయారు చేసుకోవచ్చు. మాడల్–1 యంత్రము రూ. 25,000/–, మాడల్–2 యంత్రం రూ. 30,000/– ఉంటుంది. ప్యాకింగు, రవాణా ఖర్చులు అదనం. డబ్బు పంపిన 15 రోజులలో యంత్రం అందజేయ బడుతుంది. కావలసినవారు 'దేవాంగ్ కంబాటియా', సెల్ నెం. 9904646555 లేదా 9824079439 సంప్రదించ గలరు.

గోశాలలు, డైరీ ఫారంలు, పాడి పశువులు సమృద్ధిగా వున్న పెద్ద రైతులకు లభ్యమయ్యే పేడను సులభంగా వ్యాపారాత్మకంగా పైన తెలిపిన పేడను ఉపయోగించే మూడు యంత్రాలు వినియోగించుకుని ఆదాయం పెంచుకోవటానికి తోడ్పడుతాయి. ●

## సవరణ

గత మే–జూన్ 2016 పల్లెసృజన సంచికలో '8వ ద్వైవార్షిక పోటీలు' వ్యాసంలో ప్రోత్సాహక బహుమతి క్రింద "బిల్వ కాయలను వలిచే యంత్రం" అని ముద్రించడం జరిగింది. అది "బిల్వ కాయలు" కాదు 'భిలావా కాయలు', ఇది హిందీ పదం. వాటిని తెలుగులో "నల్ల జీడి గింజ" గా సవరించుకుని చదువుకో గలరు. బిల్వ అంటే మారేడు. మారేడు కాయ నుండి నూనె రాదు, పొక్కదు. ఆ గుణం జీడి గింజకే ఉంది. ఇది 'జీడిపప్పు కాదు, జీడి మామిడి' అని గమనించ గలరు. ఆంగ్లం నుండి తర్జుమా చేసే క్రమంలో జరిగిన ఈ పొరపాటును క్షంతవ్యులం. -ఎడిటర్

సూర్యుడిలా వెలగాలి అనుకుంటే ముందు సూర్యుడిలా కాలడం నేర్చుకో.

# రైతుల కొరకు రైతులు తయారు చేసిన
# అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు

## సయ్యద్ సుభాని స్ప్రేయర్లు



బూమ్ స్ప్రేయర్



సోలార్ స్ప్రేయర్



మోటార్ సైకిల్ స్ప్రేయర్

లిమ్కా రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుని, ఎంతోమంది రైతులకు అత్యధికంగా కూలీల భారాన్ని, పంట నష్టాన్ని తగ్గిస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన సుభాని సోదరులు తయారు చేసిన స్ప్రేయర్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. పైన కనబర్చిన స్ప్రేయర్లే కాదు, రైతుకు ఎటువంటి అనువైన స్ప్రేయర్లనైనా తయారు చేయటం వీరి ప్రత్యేకత. మీ పొలాన్ని వీరికి చూపించినచో, కూలీల భారం తగ్గేలా మీకెటువంటి స్ప్రేయర్ అవసరమో ఆలోచించి కేవలం ఒక్క వారం రోజుల్లోనే మీకు అవసరమైన స్ప్రేయర్ తయారు చేసి ఇవ్వగల సామర్థ్యమున్న ఇన్నోవేటర్.

అంతే కాదు ఇటీవల సేంద్రియ/ ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి పెరుగుతున్న ఈరోజుల్లో ఆ వ్యవసాయానికి ప్రధానమైన 'పంచగవ్య' ను మొక్కలపై పిచికారి చేయటం కేవలం 'కల్లాపి' లా చల్లుకుంటూ చేస్తున్న వైనాన్ని గమనించిన సుభాని ఆ పంచగవ్యను కూడా పిచికారి చేసేలా చేతితో నడిపే 'టిల్లర్'కు 'పిచికారి' యంత్రాలను ఏర్పాటు చేయటం వల్ల సేంద్రియ రైతాంగానికి కూడా పనిని సులభతరం చేయటంతో పాటు, కూలీల ఖర్చును కూడా తగ్గించాడు. మీ పంటలకు అవసరమైన 'పవర్ టిల్లర్' స్ప్రేయర్‌ను తయారు చేసి ఇవ్వటం వీరి ప్రత్యేకత.

సంప్రదించ వలసిన ఫోన్ నెంబర్ : **సయ్యద్ సుభాని, 98486 13687**

## మల్లేష్ సోలార్ స్ప్రేయర్, ఎరువులు చల్లే స్ప్రేయర్



బొమ్మగాని మల్లేష్ తయారు చేసిన సోలార్ స్ప్రేయర్లు ఇప్పటికే వేలాది స్ప్రేయర్లు రైతాంగానికి విస్తృత సేవలను అందిస్తున్నాయి. పొలాల్లో మందును పిచికారి చేసేందుకు చేతితో నడిపే శ్రమ లేకుండా సోలార్ శక్తి ద్వారా పని చేసే స్ప్రేయర్‌తో పాటు ఎరువులు, యూరియాలను పొలంలో చల్లేందుకు కూడా ఒక స్ప్రేయర్‌ను తయారు చేశాడు. ఇంధన ఖర్చు కూడా లేకుండా వీటిని ఉపయోగించుకుని శ్రమను తగ్గించుకోవటంతో పాటు, కూలీల భారాన్ని కూడా తగ్గించుకోవచ్చు. జీవామృతం లాంటి సేంద్రియ ఎరువులను కూడా స్ప్రే చేయటానికి అనువుగా మల్లేష్ సోలార్ స్ప్రేయర్‌లో మార్పులు చేస్తున్నాడు. త్వరలో పాఠకులకు ఆ శుభవార్త అందిస్తామని ఆశిస్తున్నాం.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : **బొమ్మగాని మల్లేష్, 8885073666**

**కష్టాల సారాంశమే విజయం.**

# మహిపాల్ వీడర్లు







పొలంలో సేద్యం చేసుకోవటానికి, అంతర సేద్యాలకు అనువైన చేతితో నడిపే వీడర్‌తో పాటు, శ్రీవరిలో ప్రధాన సమస్య అయిన కలుపు తీసేందుకు కూడా వీడర్‌ను తయారు చేశాడు వరంగల్ జిల్లాకు చెందిన కడివెండి మహాపాల్ చారి. ఇతని వీడర్లు ఇప్పటికే కొన్ని వందలు అమ్ముడుపోయి రైతాంగానికి ఎంతో ఉపయుక్తంగా పని చేస్తున్నాయి. ఇప్పటి వరకు వినియోగిస్తున్న రైతాంగం నుండి ఎటువంటి సమస్యా రాలేదు.

సంప్రదించ వలసిన ఫోన్ : **కడివెండి మహిపాల్ చారి, 98669 22168**

# ముళ్ళపూడి సత్యనారాయణ పవర్ టిల్లర్



ఎటువంటి పొలంలోనైనా సమర్థవంతంగా పని చేసేందుకు అనువుగా ముళ్ళపూడి సత్యనారాయణ రూపొందించిన స్ప్రేయర్ అత్యంత శక్తివంతంగా పని చేస్తుంది. 5 గేర్ల సహాయంతో పని చేసేలా ఒక వ్యవసాయ పరికరాన్ని తయారు చేశాడు. ఇది చిన్నకారు రైతుల ఆర్థిక స్థోమతకు అందుబాటులో వుండదని గ్రహించిన సత్యనారాయణ, సామాన్య రైతులకు కూడా అందుబాటులో వుండేలా మరో టిల్లర్‌ను తయారు చేస్తే బావుంటుందని ఆలోచించి, సాధారణ పొలాలకు (ఇది కూడా పైన తెలిపిన టిల్లర్ ఇంచుమించు సమానంగా పని చేస్తుంది) పనిచేసే విధంగా 3 గేర్ల సహాయంతో పని చేసే టిల్లర్‌ను రూపొందించారు. గట్టి సేద్యాలకు, అంతర సేద్యాలకు ఎంతో ప్రభావ వంతంగా పని చేస్తుంది. భూమి గట్టితనాన్ని బట్టి అనువైన గేరును మార్చుకుని పని చేసేలా తయారు చేశాడు. కావున రైతాంగం ఇకపై ఎక్కువ పెట్టుబడి పెట్టి పెద్ద ట్రాక్టర్ల బాడుగను మిగల్చటమే కాదు, అంతర సేద్యాలకు అత్యంత అనువైన పవర్ టిల్లర్‌లు. వీటిని వినియోగించుకుని గ్రామాల్లో నిరుద్యోగ యువత కూడా జీవనోపాధి పొందవచ్చు.

సంప్రదించ వలసిన ఫోన్ : **ముళ్ళపూడి సత్యనారాయణ, 90002 50692**

# 'సృష్టి సమ్మాన్-2016' పురస్కార విజేతలు




మార్చి 13, 2016న కొత్త ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన 'ఇన్నోవేషన్ ఫెస్టివల్' కార్యక్రమంలో వివిధ రంగాలలో సేవలందించిన సామాన్య వ్యక్తులకు 'సృష్టి సమ్మాన్–2016' పురస్కారాలను అందించటం జరిగింది. అందులో వ్యవసాయానికి, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన కొన్నింటిని మీముందు ఉంచుతున్నాం. **– ఎడిటర్**

చెరువులలో, నీటి గుంటలలో గుర్రపు డెక్కను తీసే యంత్రం

పేరు : **గోదాసు నర్సింహ**

వయస్సు : **45 సం.లు**

చిరునామా : **ముక్తాపూర్, పోచంపల్లి పోస్ట్ & మం.,**
**నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం–508 284.**

ఫోన్ : **9492558698**



గోదాసు నర్సింహ 'పల్లెసృజన' పాఠకులకు సుపరిచితుడే. ఇతను తయారు చేసిన గుర్రపు డెక్క తీసే యంత్రం గురించి ఇదివరలో పల్లెసృజన పత్రికలో ప్రచురించటం జరిగింది. దీన్ని ఉపయోగించి హైదరాబాద్ నగరంలోని గుర్రపు డెక్కతో నిండిన అనేక చెరువులను మహానగరపాలక సంస్థ కోరికపై తీసివేసి పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తయారు చేయటం జరిగింది.

చెరువులలో నిండిపోయిన గుర్రపు డెక్కను తీసివేయటమే కాక, దానిని చిన్న చిన్న ముక్కలుగా చేయటం వల్ల ఎక్కువ స్థలాన్ని ఆక్రమించకుండా చేయటంతో పాటు దాన్ని పౌష్టిక ఎరువుగాను, అవసరమైతే దాని ద్వారా ఇతర అవసరాలను వినియోగించుకునే విధంగా తయారు చేయటం వల్ల ఈ యంత్రం దేశంలోని పలువురి దృష్టిని ఆకర్షించింది. కాలుష్యపు కోరల్లో చిక్కుకుంటున్న చెరువులను అందంగా మార్చటంలో ఈ యంత్రం ఎంతో ఉపయోగకరంగా వుంటుంది. దీన్ని చూసి అనేక ప్రాంతాల వారు కూడా కుతూహలాన్ని ప్రదర్శిస్తున్నారు. హైదరాబాద్‌లోని అనేక చెరువులలో గుర్రపు డెక్కను తీసివేయటంతో ఆ ప్రాంత ప్రజానీకం తమ సమీపంలో వున్న

లక్ష్యం లేకపోవటం కన్నా పెద్ద నేరం ఏదీ ఉండదు.



చెరువు "ఇంత అందంగా ఉందా?!" అనేంతగా చెరువులను శుభ్రపర్చటం జరిగింది.

నర్సింహ చేసిన ఈ కృషిని 'పల్లెసృజన' వెలుగులోకి తీసుకు రావటంతో అతనికి 'సృష్టి' అనే జాతీయ స్వచ్ఛంద సంస్థ 'సృష్టి సమ్మాన్ – 2016' పురస్కారానికి ఎంపిక చేయటంతో సన్మాన గ్రహీత నర్సింహతో పాటు ఆయన సతీమణి, లావణ్యతో రాష్ట్రపతి భవనంలో ఈ పురస్కారం అందుకున్నందుకు పల్లెసృజన కూడా తమ సంతోషాన్ని వ్యక్తం చేసింది.



## వెదురు చీల్చే యంత్రం

పేరు : **లియాగి భట్**

వయస్సు : **52 సంవత్సరాలు**

చిరునామా : **ముదాంగ్ తాగే గ్రామం, లోయల్ సబాన్‌శ్రీ జిల్లా, అరుణాచల్ ప్రదేశ్.**

ఫోన్ : **9774482142**

వృత్తిరీత్యా మోటార్ మెకానిక్‌గా పనిచేసే భట్ వెదురును చదును చేసి, చీల్చి, తడకలుగా చేయటానికి ఉపయోగ పడే ఈ యంత్రాన్ని రూపొందించటం ద్వారా తడకలు తయారు చేసే పనివారికి మూడు వంతుల శ్రమను తగ్గించాడు.

అరుణాచల్ ప్రదేశ్ లాంటి పర్వత ప్రాంతాలలో వెదురును అలంకరణ వస్తువులను తయారు చేయటానికే కాక ముఖ్యంగా గృహ నిర్మాణాలకు కూడా ఉపయోగిస్తుంటారు. సాధారణంగా వెదురు బొంగులను చదును చేసి చీల్చటం అన్నది చాలా శ్రమతో కూడుకున్న పని. కనీసం నలుగురు మనుషులు రోజుకి 25 నుంచి 30 బొంగులను మాత్రమే చీల్చ 25–30 తడకలను మాత్రమే చేయగలరు. కానీ, భట్ తయారు చేసిన ఈ యంత్రం సహాయంతో ఒకే వ్యక్తి రోజుకి 130–150 తడకలను తయారు చేసే అవకాశ మంటుంది. ఈ యంత్రం వెదురును పొడవుగా చీల్చటమే కాక, కావలసిన పొడవులో చిన్న ముక్కలుగా చేయటానికి కూడా ఉపయోగ పడుతుంది.

సింగిల్ ఫేజ్ కరెంటుతో పనిచేసే ఈ యంత్రం ప్రస్తుతం బరువుగా ఉన్నా, దీనిని ఇంకా తేలికగా చేసే ప్రయత్నంలో ఉన్నాడు భట్. ఈయన ఈ యంత్రాన్ని



ఒక్కొక్కప్పుడు బడి మానేసి స్నేహితులతో షికారుకెళ్ళడమే మంచిదేమో. ఎందుకంటే ఎదిగాక అనిపిస్తుంది....
నాకొచ్చిన మార్కులలో ఆనందం లేదు, కానీ నా జ్ఞాపకాలలో ఆనందం ఉంది అని.





1997లో తయారు చేసి, ఐఐటి, గౌహతి లోని 'గియాన్' వారికి చూపించాడు. యంత్రం చాలా బాగుంది అని చెప్పటంతో ఇతరులు దీనిని చూసి నకిలీలు తయారు చేస్తారన్న భయంతో చాలాకాలం ఎవరికీ చూపకుండా ఉంచేశాడు. దీని పనితనం గురించి విన్న 'పాంలుక్' గ్రామంలోని ఒక కుటుంబం తమ గృహ నిర్మాణంలో ఈ యంత్ర సహాయాన్ని కోరారు. దీని ఖరీదు రూ. 50 వేలు అని చెప్పటంతో వెనక్కి తగ్గారు. అరుణాచల్ ప్రదేశ్ లోని రూబూ బుకర్ అనే ఒక అధికారి వ్యక్తిగతంగా కాక, సామూహికంగా కొందరు కలిసి ఈ యంత్రాన్ని కొని వాడితే ఆ ప్రాంతంలో నివసించే వారికి వెదురుతో ఇల్లు కట్టుకోవడం లో ఇది చాలా ఉపయోగికరంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు.

**మగ్గాల 'చిటిక'కు దారం చుట్టే యంత్రం:**



పేరు : **ప్రబీన్ కలితా**

వయస్సు : **54 సం.**


చిరునామా : **కేరాఫ్ ఇంఛార్జ్ సైంటిస్ట్, సెంట్రల్ సిల్క్ బోర్డ్, బోకో, కామ్‌రూప్ జిల్లా, అసోం - 781123.**

ఫోన్ : **9854748661**

చేనేత మగ్గాలలో 'చిటిక' ప్రధాన పాత్ర పోషిస్తుంది. దానికి దారం చుట్టడానికి యంత్రాలు ఎన్నివున్నా సులభమైన తేలిక యంత్రం లేదు. పట్టు పరిశోధనా కేంద్రంలో పనిచేసే 'ప్రవీన్ కలితా' పట్టు వస్త్రాలు నేయటం దగ్గరుండి చూసినవాడు కనుక ఆ ప్రాంతంలో 'మూగ పట్టు వస్త్రాలు' నేయటంలో పనికి వచ్చే 'చిటిక'లకు దారం చుట్టే ఈ చెక్క యంత్రాన్ని తయారు చేశాడు.

దీనికై భారీ యంత్రాలు కొన్ని లభిస్తున్నా, వాటిప పనిచేయటం కష్టం. చిటిక చుట్టడంలో, నేయడంలో తరచూ పోగులు తెగిపోవటం జరుగుతుండేది. ఆ యంత్రం ఖరీదు కూడా ఎక్కువగా వుంటుంది. ఇవన్నీ గమనించిన 'ప్రబీన్' చవకగా, ఎక్కువ పనితనం కల ఒక సులభమైన యంత్రాన్ని రూపొందించాలని నిర్ణయించుకొని కొన్ని నెలల పాటు శ్రమించి, చెక్కతో ఈ యంత్రాన్ని రూపొందించాడు. ఈ యంత్రం కేవలం 50 కిలోల బరువుంటుంది. సులభంగా, త్వరగా చిటికలు చుట్టడానికి వీలవుతుంది. దారపు పోగులు తెగే అవకాశం తక్కువ. ఇప్పటికే అస్సాం పరిసర ప్రాంతాలలో 8 యంత్రాలు అమ్మగా అన్నీ సమర్థవంతంగా పని చేస్తున్నాయని అన్నాడు ప్రబీన్.

**విద్యార్థులలో ఉండాల్సిన ముఖ్య లక్షణం ప్రశ్నించటం. వాళ్ళకా అవకాశమివ్వండి.**




**యాంత్రీకరించిన మగ్గం:**



పేరు : **సోరోఖైభం బిరెన్ సింగ్**
వయస్సు : **55 సం.**
చిరునామా : **బిష్ణుపూర్‌ఖా, వార్డ్ నెం. 7, బిష్ణుపూర్, మణిపూర్.**
ఫోన్ : **09856483293**

బిరెన్ సింగ్ సాంప్రదాయ చేనేత మగ్గాన్ని ఆధునీకరించి 0.5 హార్స్ పవర్ మోటార్‌తో పనిచేసేలా మార్పు చేయటం ద్వారా నేత కార్మికులకు శారీరక శ్రమ తగ్గి ఉత్పత్తి అధికమయ్యే మార్గం చూపించాడు.

యువకుడిగా వున్నప్పుడు బిరేన్‌సింగ్ ఒకసారి స్నేహితులతో బైటకి వెళ్ళి సైకిల్‌పై తిరిగి వస్తూవుండగా అది కాస్తా పంచరైంది. చీకటి అవుతూ వుండటంతో దగ్గరే వున్న ఒక ఇంట్లో ఆ రాత్రి గడపాలని నిశ్చయించుకున్నారు మిత్రులంతా. ఆ ఇంట్లో ఒక వయసు మళ్ళిన ఒకామె వీపుపై పసిపాపను కట్టుకొని గుడ్డి దీపపు వెలుగులో పాత మగ్గంపై స్థానికంగా వాడే 'ల్యాంగ్‌పీ' అనే వస్త్రం తయారు చేస్తూవుంది. వీపుమీద పాపతో, గుడ్డి దీపంతో, తెగుతున్న పోగులతో ఆమె కష్ట పడటం గమనించి, ఇటువంటి వారి కష్టం తీర్చడానికి కరెంటు ఎందుకు వాడుకోకూడదు? అని ప్రశ్నించు కున్నాడు. అప్పటినుంచి చేతి మగ్గాలను యాంత్రీకరించే పరిశోధనలో పడ్డాడు. చాలాకాలం శ్రమించి, అనేక మందితో చర్చించి, చూసి నేర్చుకొని



2007వ సంవత్సరంలో మొదటిసారి ఒక యంత్రాన్ని తయారు చేశాడు. మణిపురి ప్రాంతంలో మగవారు వాడే 'హనేక్', స్త్రీలు వాడే 'ఖుదియ్' వస్త్రాలని నేశాడు. తరువాత టవల్లు, అంగ వస్త్రాలను కూడా నేసి తన యంత్రం సంతృప్తికరంగా పని చేస్తుందని నిర్ధారించుకున్నాడు.

ఇతను తయారు చేసిన యంత్రంలో చెక్క వాడే చాలా చోట్ల స్టీలును ఉపయోగించాడు. దాంతో సైజు తగ్గిపోయింది. 'చిటికలు' వాడే బదులు బాబిన్‌ల నుండి నేరుగా దారం వచ్చే ఏర్పాటు చేశాడు. దాంతో పని త్వరగా, సులువుగా అయింది. ఈ యంత్రం సహాయంతో సాధారణంగా ఒకటి రెండు బట్టలు నేసేచోట, మూడు నుండి నాలుగు బట్టలు నేసే సదుపాయం ఏర్పడింది. కేవలం బాబిన్‌లు మార్చడం తప్ప మిగతాదంతా యంత్రమే చేస్తుంది.

మణిపూర్, తూర్పు ఇంఫాల్, పశ్చిమ ఇంఫాల్, తవ్‌బుల్, బిషంపూర్ జిల్లాలలో ఇప్పటివరకు 18 యంత్రాలను అమ్మాడు. ప్రతి యంత్రం రూ. 1.25 లక్షలనుండి, రూ. 1,30 లక్షల ఖరీదు చేస్తుంది. అనుబంధ వస్తువులతో కలిపి రూ. 1.50 లక్షల వరకు ఉంటుంది. ●

**పల్లెసృజన చందాదారులకు విజ్ఞప్తి**

మీ చందాను పునరుద్ధరించుకునేవారు మీ చందాను పంపేటప్పుడు సభ్యత్వ సంఖ్యను తెలియజేయ గలరు. మీ సభ్యత్వ సంఖ్య, చందా తిరిగి కట్టవలసిన తేదీలు పల్లెసృజన పత్రిక పంపే గోధుమ రంగు కవరుపై అతికించే మీ చిరునామా లేబుల్‌లో మీ పేరు పైన ముద్రించబడి వుంటుంది. వివరాలకు ఫోన్ : 040-2711959 లో సంప్రదించ గలరు.

**దేశంలో చాలా తెలివైన వారు పాఠశాల గదుల్లో చివరి బెంచీలో కూర్చువారై ఉండొచ్చు.**

# 'రెండు బోర్లను ఒకే మోటరుతో నడిపే' జ్ఞానాన్ని
## రైతులకు అంకితమిస్తున్న పుల్లారెడ్డి



నల్గొండ జిల్లా, మునగాల మండలం, ముకుందాపురం గ్రామ రైతు 'పందిరి పుల్లారెడ్డి' పల్లెసృజన పాఠకులకు చిరపరిచితుడే. ఆయన అందించిన జ్ఞానం "రెండు బోర్లకు ఒకే మోటరు" ను వినియోగించుకుని 50 మందికి పైగా రైతులు ఇప్పటికే తమ పొలాలలో నీటి సమస్య నుండి ఉపశమనం పొందారు. 2014 జనవరి–ఫిబ్రవరి 'పల్లెసృజన' పత్రికలో ప్రచురితమైన ఆయన కథనం ఆ తర్వాత 'సాక్షి' దినపత్రికలో కూడా ప్రచురితం కావడం జరిగింది. అయినా ఇప్పటికీ ఎంతోమంది రైతాంగం ఆయనకు, పల్లెసృజన కార్యాలయానికి ఫోన్లు చేస్తూనే వున్నారు. అంటే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇంకా ఎంతో మంది రైతాంగానికి ఈ పద్ధతి అవసరమని గ్రహించాడు పుల్లారెడ్డి.

తనకు వచ్చే ఫోన్ ద్వారా ఆ రైతు వివరాలను తెలుసుకుని అతని వద్దకు స్వయంగా వెళ్ళి, రెండు బోర్లకు ఒకే మోటార్‌ను అమర్చుతూనే ఉన్నాడు. అలా రైతు వద్దకు వెళ్ళి తాను ఏర్పాటు చేసే తన జ్ఞానానికి అతను తీసుకునే రుసుము .... తన రవాణా ఖర్చులతో పాటు ఆ రైతు ఆనందంగా ఇచ్చే కొన్ని వందల రూపాయలు మాత్రమే.

ప్రస్తుతం వర్షాలు బాగా కురవటంతో కొన్ని ప్రాంతాలలో రైతులు ఇప్పుడు తమ రెండు బోర్లకు ఒకే మోటార్‌ను ఏర్పాటు చేసుకునేందుకు తనను పిలవటం ఎక్కువవుతోంది. కానీ, తన స్వంత వ్యవసాయ పనుల దృష్ట్యా వారివద్దకు వెళ్ళి ఈ విధానాన్ని ఏర్పాటు చేయటం కుదరటం లేదు. దీని వల్ల ఎంతో మంది రైతాంగం నష్ట పోవటం అతన్ని కలచి వేసింది.

కేవలం కొన్ని రూపాయల కోసం ఇంతమంది రైతాంగాన్ని నష్ట పరచటం సబబు కాదని, తన జ్ఞానాన్ని అందరికీ ఉచితంగా పంచాలని నిర్ణయించుకున్నాడు. ఇది ఎంత గొప్ప నిర్ణయమో, ఆయన హృదయం ఎంత విశాలమో వర్ణణాతీతం. అమ్మా నాన్నలైన వెంకట రెడ్డి, శేషమ్మల పేర్లతో 'వేంకట శేషాద్రి వాటర్ పంపింగ్ సిస్టం'గా ఈ పద్ధతికి నామకరణం చేశారు.

రైతుల శ్రేయస్సుకై తన జ్ఞానాన్ని ఉచితంగా పంచుతున్న పుల్లారెడ్డి 'రైతు బాంధవుడు' అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ పద్ధతినిజాగ్రత్తగా ఏర్పాటు చేసుకుని రైతాంగం తమ కష్టాల నుండి గట్టెక్కాలని ఆశిస్తున్నాడు. ఏర్పాటు సమయంలో ఏవైనా అనుమానాలు వస్తే తనను సంప్రదిస్తే దానికి పరిష్కారం ఫోన్లోనే అందించ గలను అంటున్నాడు పుల్లారెడ్డి. ఈ విధంగా చేయటం వల్ల తక్కువ నీరు ఉన్న రెండు బోర్లను కలిపితే తమ పంపుసెట్టు నిరంతరాయంగా నీటిని అందించే అవకాశాలు మెండుగా ఉంటాయి.

**రెండు బోర్లకు కలిపి ఒకే మోటారును ఏర్పాటు చేసుకునే విధానం:**

పొలంలో 20 నుండి 30 అడుగుల దూరంలో రెండుచోట్ల బోరు బావి త్రవ్వించుకున్నట్లయితే, వాటిల్లో

**నీవు నీ భవిష్యత్తుని మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను మార్చుకోగలవు. మారిన నీ అలవాట్లే నీ భవిష్యత్తుని మారుస్తాయి.**




తమ పొలానికి తగినంత నీరు లభించే అవకాశం లేకుండా ఉంటే ఈ రెండింటినీ కలిపి ఒకే బోరు బావికే పంపును అమర్చుకుని రెండు బోర్లలోని నీటిని రైతు నిరంతరాయంగా పొందవచ్చు.

ఒక్కో బోరు బావి 150 అడుగుల లోతు ఉందనుకోండి వాటిల్లో నీరు ఒకసారి పరిశీలించాలి. బోరు బావుల్లో నీరు భూ మట్టానికి 8 అడుగుల లోతువరకు నీరు నిండి వుందనుకోండి. ఒక బోరు బావిలో 130 అడుగుల లోతులో పంపును బిగించుకున్నారనుకుందాం. ఈ పంపుసెట్టు బిగించిన బావిలోకి హెచ్‌డిపి పైపు (10 గేజి మందము కలది) 115 అడుగుల లోతు వరకు చొప్పించాలి. సాధారణంగా బోరు బావికి 6 అంగుళాల పైపు వుంటుంది, ఇందులో వేసిన పంపు సెట్టుకు రెండున్నర అంగుళాల పైపు బిగించబడి వుంటుంది. కాబట్టి మీరు వేసే హెచ్‌డిపి పైపు ఒకటిన్నర అంగుళాలదై వుండాలి. ఆ పైపు మరో కొసను దూరంగా వున్న పంపు లేని మరో బావిలోకి 100 లేదా 105 అడుగుల లోతులోనే వుండేట్లు చూసుకోవాలి. అంటే మొత్తం హెచ్‌డిపి పైపు పొడవు 115 (పంపుసెట్ వున్న బోరు బావి) + 105 (పంపు లేని బోరు బావి) + 70 (బోరు బావుల మధ్య దూరం) అడుగుల పొడవుదై వుండాలి.

ఈ హెచ్‌డిపి పైపును బోరు బావిలోకి చొప్పించే ముందుకు మీరు చేయవలసిన పని.... హెచ్‌డిపి పైపు ఒక కొసను బోరు బావి ద్వారా పంపునుండి నీరు పారే చోట వుంచినట్లయితే అందులోకి నీరు నిండి ఆ పైపు మరో కొసలోంచి నీరు వచ్చేవరకు నింపాలి. ఆ తర్వాత హెూస్‌పైపు రెండు కొసలకు కొద్దిగా ఎత్తులో వుంచి పట్టుకుని రెండు వైపులా గోనె సంచిలో తడిపిన నల్లమట్టిని ఉంచి పైపులోంచి నీరు బైటకు రాకుండా బిరడాలాగా బిగించాలి.

టివిఎస్ మోపెడ్ యొక్క ఒక ట్యూబును ఒక్కోటి ఒక అడుగు పొడవు వుండేట్లుగా రెండు ముక్కలు చేసుకుని దాన్ని పైపుకు పై భాగాన చొప్పించి మరో కొసను ఒక




**నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది, సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది, ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి, జ్ఞానం మిమ్ములను గొప్పవాళ్ళను చేస్తుంది.**



తాడుతో బిగుతుగా కట్టాలి. తాడు యొక్క మరో కొసకు 30 అడుగుల పొడవున్న ఒక ఇనుప కడ్డిని బిగించాలి. ఇలా హోస్ పైపును రెండు కొసలలో చెయ్యాలి. ఆ తర్వాత హోస్ పైపును చెరోవైపు ఇనుప కడ్డీలతో సహా రెండు బోరు బావుల్లోని నీటిలో కనీసం 10 అడుగుల లోతుకు వెళ్ళేలా వుంచిన తర్వాత ఆ పైపుకు బిగించిన ఇనుప కడ్డీలను గట్టిగా క్రిందకు నెట్టినట్లయితే దానికి ముడివేసిన ట్యూబు, లోపలికి చొప్పించిన మట్టితో కూడిన గోనె సంచులు బయటకు వస్తాయి. ఇనుప కడ్డీలను బావులనుండి బయటకు తీయాలి. ఇప్పుడు హోస్‌పైపు రెండు కొనలు రెండు బావుల్లో నీటిలో మునిగి వుంటాయి, పైపు నిండి నీరు కూడా అలాగే నిండుగా వుంటుంది. ఆ తర్వాత పైపును పైకి కిందకు ఊపుకుంటూ బోరు బావి లోపలికి చొప్పించాలి. ఇలా చేయటం వల్ల హోస్ పైపులో ఎటువంటి గాలి బుడగలు లేకుండా పమోతాయి. అందులో గాలి ఉన్నట్లయితే ఈ పద్ధతి పని చేయదని గమనించాలి. మోటారు ఉన్న బోరు బావిలోకి 115 అడుగుల లోతు, ఖాళీగా వున్న బోరు బావిలోకి 100 లేదా 105 అడుగుల లోతు ఈ నీరు నిండిన హోస్ పైపు వెళ్ళేలా చూసుకోవాలి. రెండు వైపులా బోరు బావిలోకి దిగిన హోస్ పైపు ఎత్తులలో 10–15 అడుగుల వ్యత్యాసం ఉండేలా చూసుకోవడం మరువకండి.

ఇలా చేసినట్లయితే ఇప్పుడు హెచ్‌డిపి పైపులోని నీరు క్రిందకి వెళ్ళకుండా అలాగే వుంటుంది. ఇప్పుడు పంపుసెట్‌ను ఆన్ చేసినట్లయితే, అది నీరు తోడటం ప్రారంభించిన కొన్ని సెకండ్లలోనే ఖాళీగా వున్న బోరు బావిలోని నీరు ఈ హెచ్‌డిపి పైపు ద్వారా మోటారు వున్న బావిలోకి వస్తూ వుంటుంది. ఈ పైపు వద్ద చెవిని పెట్టి విన్నట్లయితే ఆ నీరు ఎంత వేగంలో వస్తుందో కూడా గమనించవచ్చు. ఇక్కడ జరుగుతున్నదేమిటంటే పంపు సెట్ తోడుతున్న నీరు ఈ పైపు ద్వారా బయటకు వస్తుంటే, అందులో సగం నీరు అవతల ఖాళీగా వున్న బోరు బావిలో నుంచి వస్తుందని గమనించ గలరు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

హెచ్‌డిపి పైపులో నీరు ఎలాంటి గాలి బుడగలు లేకుండా నిండుగా వుండేలా చూసుకోవాలి. హోస్ పైపుకు ఎలాంటి లీకులు లేకుండా జాగ్రత్త వహించాలి. ఈ రెండు బోరు బావుల మధ్య ఎడం పొలం మధ్యలో వున్నట్లయితే, రెండింటి మధ్యన వేసే హోస్ పైపు వల్ల సేద్యాలకు అంతరాయం ఏర్పడుతుంది. కాబట్టి పొలంలో సేద్యం జరిగే లోతుకన్నా కొద్దిగా ఎక్కువగా ఈ హోస్ పైపును భూమిలోపల ఏర్పరచుకుంటే సరిపోతుంది. కేవలం రెండు బోరు బావుల వద్ద మాత్రమే పైకి వచ్చి వాటిలోకి వెళ్ళేలా ఏర్పాటు చేసుకున్నట్లయితే ఎలాంటి ఆటంకమూ ఉండదు. రెండు బోరు బావుల కేసింగ్ పైపుల అంచులకు ఒక వైపున అర్థ చంద్రాకారంలో కత్తిరించినట్లయితే ఈ హోస్ పైపుకు ఎటువంటి ఆటంకం లేకుండా ఉంటుంది. ఈ పద్ధతిని ప్రస్తుతం తయారుగా వున్న రెండు బోరు బావులపై వాడుకోవచ్చు, లేదా ఒక బోరు ఉన్నవాళ్ళు మరో బోరును 25-30 అడుగుల దూరం వేయించుకుని ఈ పద్ధతిని ఉపయోగించుకుని ఒకే మోటరు ద్వారా రెండు బోర్లలోని నీటిని వినియోగించుకోవచ్చు.

రెండు బోర్లను అతికించే విధానాన్ని చిత్రంలో పొందు పర్చటం జరిగింది. ఈ ఏర్పాటు చేసుకోవటంలో ఏదైనా అనుమానాలుంటే జ్ఞానకర్త పందిరి పుల్లారెడ్డికి ఫోన్ చేసినచో (ఫోన్ నెం. 9963239182) మీ అనుమానాలను నివృత్తి చేయగలరు. యావత్ రైతాంగం ఈ పద్ధతిని ఏర్పాటు చేసుకుని మీ పంటలను కాపాడుకోవాలని పందిరి పుల్లారెడ్డితో పాటు పల్లెసృజన కూడా కోరుకుంటోంది. ఈ ఏర్పాటు చేసుకున్న రైతాంగం తమ అనుభవాలను 'పల్లెసృజన' ద్వారా ఇతరుకు అందే ఏర్పాటు చేస్తే బావుంటుంది. ●

**మీ కలలను సాకారం చేసుకోవాలంటే మీరు ముందు కలలు కనాలి.**

చిన్నారుల జ్ఞానం

# 'ఇగ్నైట్-2015' లో బహుమతి పొందిన చిన్నారుల ఆలోచనలు



**తర్నా జాయ్**
2వ తరగతి,
ధలాయ్ జిల్లా, త్రిపుర



**ఐదు కన్నా ఎక్కువ మందికి నీడనిచ్చే గొడుగు**



**మహమ్మద్**
10వ తరగతి,
కుల్‌గామ్, జమ్ము& కాశ్మీర్



**వండిన అన్నంలో ,ఇతర పదార్థాల్లో రాళ్ళని కనిపెట్టే పరికరం**




**భరత్**
11వ తరగతి,
దంతెవాడ, ఛత్తీస్‌ఘడ్



**బీడి ఆకులు తెంపడానికి సరళమైన పరికరం**



**ప్రత్యూష్ దత్త**
12వ తరగతి,
హౌరా, పశ్చిమ బెంగాల్



**శబ్దం లేకుండా పని చేసే సుత్తి**



**అరవింద్ గోపాలకృష్ణ**
12వ తరగతి,
చెన్నయ్,
తమిళనాడు



**ముద్రించిన పేపర్‌ను తెల్లగా మార్చి తిరిగి వాడుకునేలా యంత్రం**



**సిమ్రాన్ ఛంధా**
8వ తరగతి,
లూధియానా, పంజాబ్



**వర్షంలో తడిచినపుడు పార్కులోని బెంచిపై కూర్చోలేం. వాటిని త్రిప్పేలా ఏర్పాటు చేస్తే బావుంటుంది.**



**సోరింగ్ లెప్చా**
6వ తరగతి,
పెంటోక్, ఉత్తర సిక్కిం



**సుభాష్ ప్రాధాన్**
6వ తరగతి, సిక్కిం



**ప్రతి కుళాయికి వాటర్ ఫిల్టర్**



**రామ్ ఆకాష్**
11వ తరగతి,
కన్యాకుమారి,
తమిళనాడు



**నిమిషా కాత్యాయన్,**
12వ తరగతి,
రాంచీ, జార్ఖండ్



**వృద్ధులు రైలు నుండి దిగేందుకు వాలు చెక్కను రైలు భోగీలో ఏర్పాటు చేస్తే బావుంటుంది.**



**జయప్రకాశ్**
12వ తరగతి,
గాంధీనగర్, గుజరాత్



**తన్మయ్ తకాలె**
12వ తరగతి, పూనె, మహారాష్ట్ర



**తలుపులు తెరవటానికి కాలితో బటన్ నొక్కితే తెరుచునేలా ఏర్పాటు చేస్తే బావుంటుంది.**



**ప్రేమ్ రాజన్ సింగ్**
9వ తరగతి, దమన్



**శివాని సింగ్**
9వ తరగతి, దమన్




**అంకుష్ పాల్**
9వ తరగతి, దమన్



**చెత్తకుప్ప తొట్టి నిండగానే మున్సిపాలిటీ వారికి మెసేజ్ వెళ్తే బావుంటుంది**



**దీప్తి మంజరి**
10వ తరగతి,
నయాగర్, ఒడిస్సా



**ధాన్యపు గాజలలో పురుగులు ఉన్నాయని తెలిపే సాధనం**



**ప్రద్యుమ్న పాల్**
9వ తరగతి,
భువనేశ్వర్, ఒడిస్సా



**రాహుల్ కుమార్**
9వ తరగతి, పాట్నా, బీహార్



**బస్సులో ప్రయాణీకులు చేతులు బయట పెడ్తే డ్రైవర్‌కు సంకేతం వస్తే బస్సు ఆపి ప్రమాదాన్ని నివారిస్తాడు.**

# మారుమూల 'తెలంగాణ మూలికా వైద్యుల' అద్భుత సమ్మేళనం



– జె. శశిమోహన్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రథమ మూలికా వైద్యుల సమావేశం 2016 జూన్, 6–7 తేదీలలో హైదరాబాద్ దూలపల్లి లోని తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ అకాడమీ ప్రాంగణంలో నిర్వహించ బడింది. ఈ సమావేశం 'పల్లెసృజన', తెలంగాణ రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డు, తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సమావేశానికి 24 మంది మూలికా వైద్యులు హాజరై, 21 రుగ్మతలకు (మనుషులు మరియు జంతువులకు సంబంధించిన) 115 మూలికా వైద్య విధానాలను వెల్లడించడం జరిగింది.

ఈ సమావేశానికి ఎన్.ఐ.ఎఫ్. నుండి డా. కాంతి పటేల్, వినోద్ కుమార్ లు, డా. బిఆర్‌కెఆర్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సెంటర్ ఫర్ రీసర్చ్ ఇన్ యునాని మెడిసిన్ శాస్త్రవేత్తలు, ఆయుష్ సంస్థ నుండి అధికారులు, శాస్త్రవేత్తలు, తెలంగాణ అటవీశాఖ అధ్యాపకులు, శిక్షణార్థులు, రాష్ట్రం నలుమూలల నుండి నిష్ణాతులైన నిపుణులు, పల్లెసృజన వాలంటీర్లు మొదలైన వారు హాజరయ్యారు.

సమావేశంలో వెలిబుచ్చిన వైద్య విధానాలు, అనుభవాలను 'పల్లెసృజన', ఎన్ఐఎఫ్ వారు తదుపరి చర్యలకై గ్రంథస్తం చేసి, వీడియో కూడా తీశారు.

సమావేశాన్ని ప్రారంభిస్తూ అకాడమీ డైరెక్టర్ శ్రీ రఘువీర్ "ఈ సమావేశాన్ని వివిధ వైద్య విధానాలను తెలుసు కోవటానికి, ఆ విధానాలను పరిరక్షించటానికి, భవిష్యత్ కాలానికి దీన్ని అందించటానికి పాటు పడాలి" అని కోరారు. "మూలికా వైద్యులు గ్రామీణ స్థాయిలో అనేక రోగాలకి మందులు ఇవ్వటంతో పాటు, పర్యావరణాన్ని రక్షించటంలో కూడా భాగస్వాములు అవుతున్నందుకు ఆనందంగా ఉంద"న్నారు.

బయో డైవర్సిటీ బోర్డు / ప్రభుత్వ మెంబర్ సెక్రెటరీ శ్రీ పర్గేన్ మాట్లాడుతూ "ఎంతో చదువులు చదువుకున్న

కలలు అనేవి నిద్రలో వచ్చేవి కాదు. కలలు అనేవి మీకు నిద్ర లేకుండా చేసేవి.



ఆయుర్వేద, యునాని, అలోపతి వైద్యులకన్నా ఏమీ చదువుకోని మీరు చేస్తున్న సమాజ సేవ ఎంతో గొప్పద”ని కొనియాడారు. 'నాటు వైద్యులు' అన్న పదం వాడటానికి తనకి నోరు రావటం లేదని, మీరంతా కూడా ఏ డాక్టర్లకీ తీసిపోరు అని అన్నారు. మీరంతా ఉచితంగా, లేదా చవకగా వైద్యసేవలు అందిస్తున్నందుకు ప్రజలు మీకెంతో రుణపడి ఉంటారన్నారు.

జాతీయ బయోడైవర్శిటీ బోర్డు నుంచి వచ్చిన శ్రీ మాథ్యూస్ మాట్లాడుతూ “మూలికా వైద్యుల జ్ఞానం చిన్న విత్తనం లాంటిది. దానిని నాటి, మొలకెత్తించి, కాపాడి, దాని ఫలాలని భవిష్యత్ తరాలకు అందజేయవలసిన బాధ్యత మనందరిపైనా వుంది అన్నారు. మీ జ్ఞానం ఏ పరిశోధనా శాలల నుండి వచ్చినది కాదు. మీరే స్వయంగా కష్టించి, ప్రయోగాలు చేసి, నిర్ధారించినది. వీటిని సరియైన చట్టాలు, నిబంధనల ప్రకారం రక్షించుకోవాలి” అన్నారు.

జీవ వైవిధ్య మండలి సమన్వయాధికారి శ్రీ సాయిలు మాట్లాడుతూ 'జీవ వైవిధ్య చట్టము – అది పని చేసే విధానము, దానిలోని వివిధ అంశాలు జాతీయ స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు జీవ వైవిధ్య కమిటీల ఏర్పాటు' గ్రామీణ స్థాయిలో వున్న జ్ఞానానికి రక్షణ కల్పించాలి అంటే 'పీపుల్స్ బయో డైవర్శిటీ రిజిష్టర్'లో ఆ వివరాలు నమోదు చేయవలసిన ఆవశ్యకత గురించి వివరించారు.

ఈ రెండు రోజుల సమావేశంలో మూలికా వైద్యులు తమ జ్ఞానాన్ని పంచుకోవటమే కాక, తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. స్థూలంగా వారి సమస్యలను ఈ క్రింద క్రోడీకరించడం జరిగింది.

❀ ఔషధ మొక్కలు/ విత్తనాలు లభించేలా చూడటం.

❀ వారు చేస్తున్న సేవలకి ప్రభుత్వం/ సమాజం నుండి గుర్తింపు.

❀ చేస్తున్న వృత్తి మానుకుని, ఉచితంగా లేదా అతి తక్కువ ఖర్చుతో వైద్యం చేయటానికి కష్టపడి ఔషధ మూలికలు సేకరిస్తున్నా, తమకు ప్రభుత్వం ఇతోధికంగా ఆర్థిక సహాయం చేయదు.

❀ మూలికా వైద్యులకు ప్రభుత్వపరంగా బీమా పథకం ఏర్పాటుకు వినతి.

❀ సమాజంలో మూలికా వైద్యులకు సముచిత స్థానం ఇవ్వటానికి ప్రభుత్వం వీరిని గుర్తించి నమోదు పత్రాలు అందజేయటం.

❀ మూలికా వైద్యులపై పోలీసు కేసులు నమోదైన సందర్భాలలో వారి రక్షణకి తగువిధమైన ఏర్పాట్లు చేయాలి.

❀ మూలికా వైద్యులకి పెన్షను/ జీవన భృతి/ వైద్య ఖర్చుల భృతి ఏర్పాటు చేయాలి.

❀ మూలికా వైద్యులు తమ వైద్య విధానంలో మూలికల సేకరణకి అడవులకు వెళ్ళినపుడు ఆ శాఖవారు అభ్యంతరాలు పెట్టకుండా ఒక గుర్తింపు కార్డు ఇవ్వాలి. ఎందుకంటే ఆ మూలికలను కాపాడటంలో వీరు కూడా భాగస్వాములే కనుక.

❀ అడవులలో వివిధ ప్రాంతాలలో దొరికే అరుదైన



**జీవితము - కాలము ప్రపంచంలో ఉత్తమమైన గురువులు.**
**జీవితం కాలాన్ని ఎలా సద్వినియోగం చెయ్యాలో చెప్తుంది. కాలం జీవితంలోని విలువలను నేర్పుతుంది.**

మూలికలు వీరికి అందుబాటులో ఉండే క్రమంలో అటవీ శాఖవారు, మూలికా వైద్యుల మధ్య సరియైన అవగాహన ఉండాలి.

❀ తమ వైద్య వృత్తిని కొనసాగించటానికి సమాజం నుండి వీరికి తోడ్పాటు, సముచిత గౌరవం లభించేలా ఉండాలి.

❀ స్థానికంగా ఉండే పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు మూలికా వైద్యులను తమ సంస్థలకు ఆహ్వానించి పిల్లలకి మూలికల గురించి, వాటి ప్రాముఖ్యత గురించి, జీవ వైవిధ్యం గురించి చెప్పించే ఏర్పాటు చేయడం.

❀ స్థిరీకరించిన వైద్య విధానాలు ప్రజల ఉపయోగార్థం వెబ్ సైట్‌లలో పెట్టే ఏర్పాటు చేయాలి.

❀ ఆరోగ్య బీమా పథకాలలో మూలికా వైద్య విధానాన్ని కూడా చేర్చాలి.

ఈ రెండు రోజుల మూలికా వైద్యుల సదస్సులో వైద్యులు తాము చేస్తున్న వైద్యం గురించి వివరించే క్రమంలో అనేక ఆసక్తికరమైన కథనాలు వెలుగు చూశాయి. మచ్చుకి కొన్ని మీముందుంచుతున్నాం.

**ప్రకృతి నేర్పిన వైద్యం :**

ఖమ్మం జిల్లా, పినపాక మండలం లోని పొట్లపల్లి గ్రామానికి చెందిన బోనం బక్కయ్య తనకు తెలిసిన పద్ధతిలో పూర్వీకుల నుండి పారంపర్యంగా వస్తున్న జ్ఞానంతో పాము, తేలు కాటుకు వైద్యం చేస్తూ వుండేవాడు. మంచి పేరే సంపాదించుకున్నాడు. ఒకరోజు తన వైద్యం కొరకు కొన్ని వట్టి వేప పుల్లలు అవసరమై ఒక వేప చెట్టును ఎక్కి వాటిని సేకరిస్తుండగా చెట్టు క్రింద అలజడి ఏమిటా అని క్రిందికి





చూడగా ఒక పాము, ముంగిసల పోరాట దృశ్యం కన్పించింది. గ్రామాల్లో ఇది సహజమే అయినా ఆయన అసహజమైన విషయాన్ని గ్రహించాడు. ఆ రెండూ పోట్లాడుకుంటూ వుండగా పాము కాటుకు గురైన ప్రతిసారీ ముంగిస కొంచెం వెనక్కి తగ్గి, ప్రక్కనే వున్న 'సోమిచెట్టు' అనే ఒక పెద్ద వృక్షం బెరడును కొరికి ఒక్క క్షణమాగి తిరిగి పోరాటానికి సిద్ధమవడం గమనించాడు. సాధారణంగా జరిగినట్లుగానే పాము ఓడిపోయింది. ముంగిస పామును ఎత్తుకుని వెళ్ళింది.

ఈయన చెట్టు దిగి పాము కాటుకు గురైన ముంగిస తిన్న చెట్టు బెరడు ఏమిటా అని చూసి, అటుపై పాము కాటుకు గురైన వారికి ఆ చెట్టు బెరడుతో వైద్యం చేయటం ప్రారంభించాడు. అది నూటికి నూరుపాళ్ళు పని చేస్తోంది. ఆ ప్రాంతంలో పాము కాటుకి ఖచ్చితంగా వైద్యం చేయగలడనే పేరు సంపాదించుకున్నాడు. అటవీ శాఖ అధికారులు, పోలీసులు, డాక్టర్లు కూడా ఇతని వైద్యానికి కితాబునిచ్చారు. ఆ ప్రాంతంలో అతన్ని పాముల బక్కయ్య అంటే తెలియని వారుండరు. ఇదంతా ప్రకృతిని చూసి నేను నేర్చుకున్న వైద్యమే అంటాడాయన. (బక్కన్న ఫోన్ -9948341902)

**ఆరోగ్యానికి మూలికా వైద్యులు అందించిన కొన్ని చిట్కాలు :**

**ఉమా మహేశ్వర రావు, ఖమ్మం జిల్లా :**

భారతదేశం ఔషధానికి పుట్టినిల్లు. అలాంటి జ్ఞానం కొందరు పూర్వీకుల అజ్ఞానం వల్ల నిక్షిప్తం కావడంతో కొన్ని వేల రుగ్మతలకు, రోగాలకు ఔషధం ఒక తరంతోనే అంతరించి పోయింది. మనదేశంలో పుట్టిన ఔషధాన్ని మన

**అపజయం అనే రోగాన్ని చంపే ఉత్తమమైన ఔషధం నమ్మకం మరియు శ్రమించి పని చేయటం.**

భవిష్యత్ తరాలకు నిస్వార్థంగా అందించ గలిగితే భవిష్యత్తులోనైనా అనారోగ్యం వల్ల దోపిడీకి గురి కాకుండా కాపాడ గలుగితే మనదేశానికి ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం వరుసలో నిలబడతాయనటంలో ఎలాంటి సందేహం లేదు అంటారు ఖమ్మం జిల్లా మణుగూరుకు చెందిన ఆయుర్వేద వైద్యుడు ఉమా మహేశ్వర రావు.

❀ ప్రతిరోజూ వీలైనంతసేపు నోటిలో కేవలం నీళ్ళు వేసుకుని పుక్కిళిస్తూ వుంటే చాలామటుకు రోగాలు, ముఖ్యంగా ఊబ కాయం తగ్గుతుంది.

❀ ప్రతిరోజు మార్నింగ్ వాక్ చేసేవాళ్ళు చెప్పులు, బూట్లు వేసుకోకుండా మెత్తటి ప్రదేశంలో ముఖ్యంగా పచ్చికలాంటి నేలలపై నడవటం వల్ల శరీరంలోని ఎన్నో రుగ్మతలను నివారించుకోవచ్చు/ తగ్గించుకోవచ్చు.

❀ సన్న రేగి పండ్లను (వట్టిగా ఎండిన తర్వాత) పొడి చేసుకుని, అందులో సైంధవ లవణం వేసి నీటిలో కలుపుకుని త్రాగితే అజీర్తి, గ్యాస్ లాంటి వ్యాధులు తగ్గిపోతాయి. అలసి పోయినప్పుడు ఈ ద్రావణం త్రాగితే వెంటనే ఉత్సాహం వస్తుంది. కొబ్బరి నీళ్ళలాగా, గ్లూకోజ్ లాగా పని చేస్తుంది.

❀ ఒకరోజు క్యాబేజి, మరొక రోజు దోసకాయ (బుడంకాయ) లను చిన్న చిన్న ముక్కలుగా చేసి, నీటిలో మరగ బెట్టి వడగట్టిన తర్వాత ఆ నీటిని 40 రోజులు రోజూ ఉదయమే త్రాగితే ఊబ కాయం, అధిక బరువు తగ్గుతుంది.

ఈ మూలికా వైద్యులంతా ఘనమైన పేరు ప్రతిష్ఠలున్న ఇతర వైద్యులలా కాక, కోటీశ్వరులైన ఆసుపత్రుల యజమానులలా కాక, మారుమూల పల్లెలలో ఏ వైద్య సదుపాయమూ లేని మారుమూల గ్రామీణ ప్రాంతాల





లో ఏ ఫలితమూ ఆశించకుండా వంశ పారంపర్యంగా వస్తున్న లేదా ప్రకృతినుంచి తాము నేర్చుకున్న వైద్య విధానాలతో ప్రజలకి నిస్వార్థంగా సేవలందిస్తూ కోట్లాది ప్రజల రోగాలను నయం చేస్తూ వాళ్ళకి సాంత్వన, స్వస్థత కలుగ జేస్తూ ఉన్నారు. ఆశ్చర్యకరమైన, ఆసక్తికరమైన విషయం ఏమిటంటే వీరిలో ఎవ్వరూ కూడా ధనవంతులు కాదు. ఏదో వృత్తి చేసుకుంటూ నలుగురికీ సేవ చేయాలనే దృక్పథంతో ఈ వృత్తిని అవలంభిస్తున్న మహనీయులు. తమకంటూ గుర్తింపు కావాలని వారు కోరుకోకపోయినా, వారినీ, వారి సేవలను గుర్తించటం సమాజ కనీస కర్తవ్యం.

సమాజానికి ఇంతమంచి పని చేస్తున్న ఈ మూలికా వైద్యులని ఒక వేదికమీదికి తీసుకువచ్చే మహద్భాగ్యం 'పల్లెసృజన'కు లభించింది. ఈ మా ప్రయత్నంలో జీవ వైవిధ్య మండలి అధికారులు, తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అధికారులు అందించిన తోడ్పాటుకు ధన్యవాదాలు. పల్లెసృజన వాలంటీర్లు సేవాభావంతో ఎంతో కష్టపడి ఈ సదస్సును విజయవంతం చేశారంటే అతిశయోక్తి కాదు. ●

## 20వ చిన్న శోధయాత్ర

19వ చిన్న శోధయాత్ర – జ్ఞాన యాత్ర

**అనంతపురం జిల్లాలో**

సెప్టెంబర్ నెలలో నిర్వహింప బడుతుంది.

పాల్గొనాలనుకునే వారు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సంప్రదించ గలరు. ఫోన్ : **040-27111959**

వెబ్ సైట్ : www.pallesrujana.org

నీవు క్రితంసారి చేసిన తప్పే నీకు మంచి పాఠం నేర్పుతుంది.

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయం ప్రతిపత్తిగల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము

## జాతీయ 10వ ద్వైవార్షిక పోటీలు

### పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.), 10వ ద్వైవార్షిక పోటీలకై మనదేశం నలుమూలల్లో పునాది స్థాయిలో దాగివున్న సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఎన్.ఐ.ఎఫ్. కృషి చేస్తోంది. కర్షకులు, కార్మికులు, జాలరివారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, మురికి వాడలలో నివసించువారు, మహిళలు, విద్యార్థులు మరియు సమాజంలోని ఎవరైనను ఈ పోటీలో పాల్గొనవచ్చును. మీయొక్క ఆవిష్కరణలు వ్యవసాయము (పనిముట్లు, యంత్రములు, క్రొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలగునవి), గృహోపకరణాలు, రవాణా, ఎనర్జి (శక్తి) ఉత్పత్తి/పరిరక్షణ, పనిభారం తగ్గించటం, మూలికా వైద్యము (మానవ మరియు జంతు సంబంధమైన) మొదలగువాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని ఎక్కువ కాలం మనగలిగి పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆవిష్కరణలు మీ సొంత సృజనతో ఎటువంటి సాంకేతిక మద్దతు, పర్యవేక్షణ లేకుండా సహాయం/ గుర్తింపు పొందనివై ఉండాలి. మహిళలు మరియు వికలాంగుల యొక్క ఆవిష్కరణలు/ సంప్రదాయ విజ్ఞానానికి ప్రత్యేక బహుమతులు ఇవ్వబడతాయి. చిన్నపిల్లలను (స్కూల్‌కి వెళ్ళేవారు మరియు వెళ్ళనివారు) వారియొక్క సొంత ఆలోచనలను (Original Ideas) పంపమని ప్రోత్సహిస్తున్నాము. సాంకేతిక ఆవిష్కరణలకు సంబంధించిన నమూనాలు (Prototypes), అభివృద్ధి చేయని సృజనాత్మక ఆలోచనలను (Creative ideas) కూడా ఆహ్వానిస్తున్నాము.

వివిధ కేటగిరీలలో బహుమతి ఒక్కటికి రూ. 10,000 నుండి రూ. 7,50,000 వరకు ఉంటుంది. జీవిత కాలపు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందిన వారికి బహుమతి మొత్తంలో కొంత భాగాన్ని ఉపకార వేతనము (Fellowship) రూపములో (జీవిత కాలపు పురస్కారం పొందిన వారికి 5 సంవత్సరాలు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందినవారికి వరుసగా 3 సంవత్సరాలు, 2 సంవత్సరాలు, 1 సంవత్సరము) ఇస్తారు. మొత్తము బహుమతిలో పదిహేను శాతం (15%)ను ఆవిష్కరణకర్త(లు) వారి సమాజ సంక్షేమానికి మరియు ప్రకృతికిసంబంధించిన కార్యక్రమాలలో వినియోగించవలసి ఉంటుంది.


పునాది స్థాయిలో ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు విలేఖరులకు మరియు ప్రజల యొక్క విజ్ఞానానికి/సృజనాత్మకతకు విలువను జోడించి ప్రభావితం చేస్తున్న నిపుణులకు **ప్రత్యేక గుర్తింపు** ఉంటుంది. వ్యక్తులు లేదా సంస్థలు వారి ఆవిష్కరణలు ఎన్నయినా **31 మార్చి, 2017** లోగా మాకు చేరేలా పంపండి.

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation-India, Satellite Complex,**
**Premchand Nagar Road, Ahmedabad -380 015, Gujarat**
**Phone: (079) 26732456, 2095, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org,**
**Website: www.nif.org.in**

**గమనిక :** వృత్తిపరమైన నేపథ్యం/ అనుభవం ఉన్నవారు మరియు వృత్తివిద్యా కోర్సులలో ఉన్న విద్యార్థులు ఆవిష్కరణలు / ప్రతిపాదనలు పంపుటకు అర్హులు కారు. అయితే పునాది స్థాయిలో ఆవిష్కరణలకు విలువను జోడించుటకు వారి సేవలను ఎన్.ఐ.ఎఫ్. ఆహ్వానిస్తోంది. అర్హతలు మరియు సూచనలకు సంబంధించి మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ http://www.nif.org.in/announcement.చూడండి.

మీ సంతకం ఎప్పుడు మీ ఆటోగ్రాఫ్‌గా మారుతుందో, అప్పుడే మీ జీవితం సార్థకమైనట్లు.




జూన్ నెల 24 న ఆంధ్రప్రదేశ్, కడప జిల్లా లోని వి.ఎన్. పల్లె లో మొదలై ఎర్రమల్లిపల్లె, పోచంరెడ్డిపల్లె, బసిరెడ్డిపల్లె, అడవిచర్లపల్లె, కొమ్మడి, గండ్లమిట్టపల్లె, వెల్దుర్తి, వెంకటాపురం, ఉరుతూరు, కొత్త ఉరుతూరు, తలపరూరు, పాయసంపల్లె, కీర్తిపల్లె, కొత్తపల్లె, అయ్యవారిపల్లెల గుండా కొనసాగి గంగారెడ్డిపల్లెలో జూన్ 26న ముగిసింది. ఈ చిన్న శోధయాత్రలో పాల్గొన్న కొందరు యాత్రీకుల అనుభవాలను మీముందుంచుతున్నాము.

**జోగు రవి కుమార్ :**

ఈ యాత్రలో పాల్గొన్న నాకు తోటి యాత్రీకులతో కలిసి మాట్లాడటం, వివిధ గ్రామాలలోని గ్రామస్తులతో మాట్లాడటం, మంచి అనుభవాలను ఇచ్చిందనే చెప్పాలి. ఈ యాత్ర తర్వాత మంచి మనుషులు, మంచి మనసుతో మంచి పనులు చేస్తే ప్రపంచానికి మంచి జరుగుతుందనే నాకున్న విశ్వాసం ఇంకా దృఢపడింది. నేను ఈమధ్యనే సమాజ సేవ దిశగా ప్రయాణం ప్రారంభించాను. ఈ నేపథ్యంలో ఈ చిన్నశోధయాత్ర మంచి ప్రారంభాన్ని ఇచ్చిందని ఖచ్చితంగా చెప్పగలను. యాత్రా సమయంలో యాత్రీకులు వెలిబుచ్చిన అభిప్రాయాలు, ఆలోచనలు.... ప్రత్యేకించి శరత్ చెప్పిన ఆలోచన అద్భుతంగా ఉన్నాయి. అవన్నీ అమలు చేస్తే సమాజంలో వున్న చాలా సమస్యలకి పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నాను. ముఖ్యంగా పునాది స్థాయి ఇన్నోవేషన్లని ప్రజలదాకా తీసుకువెళ్ళడానికి అనువైన చక్కటి వ్యాపార మాధ్యమాన్ని ఏర్పాటు చేయగలగాలి. దీనివలన ఇటు ఇన్నోవేటరుకి, అటు సమాజానికి కూడా మేలు జరుగుతుంది. ముందుగా చిన్న పరిధిలో పదిమంది వాలంటీర్లతో ఈ పథకం ప్రారంభించి, సాధ్యాసాధ్యాలు చూసిన తర్వాత పెద్ద పరిధికి విస్తరించుకోవచ్చు.

**వరుణ్ రెడ్డి :**

19వ చిన్నశోధయాత్రలోని నా అనుభవాలను క్లుప్తంగా వివరిస్తాను.

❀ ఈ శోధయాత్ర వలన నేను చాలా నేర్చుకున్నాననే చెప్పాలి. ముఖ్యంగా గ్రామాలు, గ్రామస్తుల గురించి నాకున్న అభిప్రాయం పూర్తిగా మారిపోయిందనే చెప్పాలి. గణేశం గారిని చూస్తే ఒక టీచరు, ఒక లీడరు ఎలా ఉండాలో తెలుసుకోవచ్చు.

❀ ఈ యాత్రలోని యాత్రీకులంతా ప్రత్యేకమైన పాత్రలు పోషింటం వలన మంచి అనుభవాలను మిగిల్చింది. ఒకే ఆలోచన గల ఇంతమందిని కలిపిన 'పల్లెసృజన'కి ధన్యవాదాలు.

❀ ఈ మూడురోజుల యాత్రలో ప్రకృతిలో ఎంత జ్ఞానం, విజ్ఞానం దాగివుందో, దానిని మనం ఎలా నేర్చుకోవచ్చునో తెలిసింది.

❀ పల్లె జనాలు ప్రకృతితో మమేకం కావటం వలన ఎంత

నేను 'హ్యాండ్‌సమ్'గా వుండే వ్యక్తిని కాదు కానీ, అవసరమున్న 'సమ్' పీపుల్‌కి నా 'హ్యాండ్' ఇవ్వగలను.

జ్ఞాన సంపన్నులుగా ఉన్నారో నేను ప్రత్యేకంగా చూశాను.

పట్టణాలతో పోల్చి చూస్తే పేదగా కనిపించినా, వీరికి అతి సాధారణ, సంతృప్తికరమైన, ఆరోగ్యకరమైన, శాంతియుత జీవితం గడపటానికి వీలవుతోంది. మనం ఎంత సంపాదించినా (పట్టణాలలో), ఎంత గొప్ప జీవితం గడిపినా, వీరితో పోల్చుకుంటే చాలా కోల్పోతున్నామనే చెప్పుకోవాలి.

❀ యాత్రలో గణేశం గారు పునాది స్థాయి ఇన్నోవేటర్ల గురించి చెపుతూ వుంటే, వారు తమకు అందుబాటులో వున్న కనీస వనరులతో ఎంత చక్కని సృజనలు చేశారో వింటూ వుంటే ఆశ్చర్యం వేసింది. సాధారణ జీవితమే ఆయుధంగా అవసరం, పట్టుదల, కష్టం, ఇతరుల కష్టాలను గురించి ఆలోచించటం చూస్తే... వాళ్ళతో పోల్చుకుంటే నేనెంత చిన్నవాడినో అనిపించింది.

❀ మన దేశానికి పట్టుకొమ్మలైన అటువంటి గ్రామాలని, గ్రామస్తులని విస్మరించి మనకి మనమే ద్రోహం చేసుకుంటున్నామేమో అనిపించింది. మా యాత్రలో గ్రామాలకి సంబంధించిన ఆరోగ్యం, వ్యవసాయం, చేనేత పని వార్ల సమస్యలు లాంటివి అనేకం తెలుసుకున్నాం.

❀ ప్రతి గ్రామంలో ప్రజలు ఎంతో ఆదరంగా మమ్మల్ని ఆహ్వానించారు. ప్రత్యేకించి అడివిచెర్లపల్లి గ్రామంలో వెన్నెల ఫౌండేషన్ ద్వారా విజయ కుమార్ గారు సేంద్రియ వ్యవసాయం చేస్తూ దానిని గురించి వివరించిన పద్ధతి చాలా బాగుంది. ఆ గ్రామ ప్రత్యేకత అక్కడ ఎవ్వరూ ధూమపానం చేయరు, మద్యం ముట్టుకోరు. గ్రామం మొత్తం సేంద్రియ వ్యవసాయం చేసే దిశలో పయనిస్తోంది.

❀ ఈ యాత్ర నాకు కొత్త అనుభవాలు, కొత్త దృక్పథం, కొత్త జ్ఞానం ఇవ్వటమే కాక ఆరోగ్యం గురించి, గ్రామీణ జీవితం గురించి నేర్పటమే కాక కష్టాలను ఎలా ఎదుర్కోవాలో, ఉన్నదాంట్లో జీవితాన్ని ఎలా కొనసాగించాలో నేర్పించిందనే చెప్పాలి. అన్నిటికన్నా ముఖ్యం అద్భుతమైన వ్యక్తులతో పరిచయం ఏర్పడింది.



❀ పల్లెసృజనకు ధన్యవాదాలు. మళ్ళీ యాత్రలో తప్పకుండా పాల్గొంటాను.

**సాయి కిరణ్ :**

పట్టణాల్లో పుట్టి పెరిగి, ఎన్నో సంవత్సరాలుగా తీరికలేని జీవితం గడుపుతున్న నాకు ఈ యాత్ర చక్కటి అనుభవాలను మిగిల్చిందని ఖచ్చితంగా చెప్పగలను.

అనేక గ్రామాలకు నడిచి వెళుతూ గ్రామస్తులను కలుసుకొని వారితో మాట్లాడటం ద్వారా నా మెదడులో చాలా ప్రశ్నలు ఉద్భవించాయి. ....

❀ జీవించటానికి ఎంత డబ్బు, ఎన్ని వనరులు కావాలి?

❀ షెడ్యూల్డు కులాలు, జాతులకి వేరే కాలనీలెందుకు? వాళ్ళనెందుకు తక్కువ చేసి చూస్తున్నాం?

❀ శారీరక వత్తిడి, మానసిక వత్తిడులను ఎలా తట్టుకోవాలి? అసలు దేనిని ఎంచుకోవాలి?

❀ మన జీవితాలను (వ్యవసాయంలో రసాయనాలు వాడి, విదేశీ వస్తువుల మోజులో పడి) ఎందుకు కష్టతరం చేసుకుంటున్నాం?

❀ సాంప్రదాయ జ్ఞానాన్ని పరిరక్షించుకోవటమెలా?

❀ మన జీవితాలకి, గ్రామీణ జీవితాలకి మధ్యేమార్గం అంటూ ఏమైనా ఉందా?......

ఈ యాత్రలో సమాధానాలు వెతకటానికి ప్రయత్నించాను. చాలామందికి తమవద్ద ఎక్కువ డబ్బు, వనరులు లేకపోయినా సుఖంగా జీవించవచ్చును అనే విషయం తెలియదు. 'పల్లెసృజన' ద్వారా నిర్వహింప బడిన ఈ శోధయాత్ర వలన నాకు అది సాధ్యమేనని తెలిసింది. ఎంత తక్కువలోనైనా మనిషి తలుచుకుంటే ఆనందంగా బ్రతకవచ్చు. షెడ్యూల్డు తెగలు, జాతుల గురించి ఎంత ఆలోచించినా నాకు సమాధానం దొరకలేదు. కాని ఒక్కటి ఖచ్చితంగా చెప్పగలను. వారి ఆర్థిక పురోభివృద్ధే సమాధాన మేమో!

ఒకరిని ఓడించడం చాలా సులువు, మరొకర్ని గెలుచుకోవటమే చాలా కష్టం.

ప్రకృతి వనరులను గురించి ఆలోచిస్తే ప్రతి మనిషికి అతను గ్రామాల్లో నివసించినా, పట్టణాల్లో వున్నా వారికి ప్రకృతి వనరుల ప్రాముఖ్యత, పరిరక్షణ గురించి తప్పనిసరిగా అవగాహన కల్పించాలి.

నా ఉద్దేశ్యంలో శారీరక శ్రమకన్నా, మానసిక వత్తిడే మనిషికి ఎంతో హాని చేస్తుంది. మా నాన్నగారు అంటూ వుండేవారు.... 'మనసు సుఖపడాలి, శరీరం కష్టపడాలి' అని. నేను ఆ సలహానే పాటించటానికి నిర్ణయించుకున్నాను.

మన సాంప్రదాయ జ్ఞానాన్ని రక్షించుకోవటం కోసం ఒక విశ్వవిద్యాలయం లాంటి సంస్థ ఏర్పాటు చేస్తే బావుంటుంది. నాకు తెలుసు దీనికి చాలా ధనము, భూమి, మనుషులు కావాలి. కాని మన తర్వాతి తరాలకి ఈ జ్ఞానాన్ని అందించటానికి ఇంతకన్నా వేరే మార్గం లేదు. వ్యక్తిగతంగా ఎవరు ఎంత చేసినా తక్కువే అనుకోవాలి. ఈ విషయంలో ఇంకా చెప్పాలంటే భారతీయ పురాతన జ్ఞాన సంపద ఒకరు చెప్తే ఇంకొకరు వినే స్థాయిలోనే ఉండిపోయింది. దీనికి కారణం మన ప్రాచీన విశ్వవిద్యాలయాలు, గ్రంథాలు సమాజానికి అందకుండానే చాలావరకు నాశనమై పోయాయి. ఎన్నో శతాబ్దాలు గడిచిపోయినా వాటిని పునర్ నిర్మించుకోలేక పోయాము. సాంప్రదాయ జ్ఞానంఎక్కువ శాతం మౌఖికంగానే సమాజానికి అందజేయ బడుతోంది. ఇప్పుడు దీనికి ప్రమాదం ఏర్పడింది. చెప్పేవాళ్ళు ఉన్నా, వినేవాళ్ళు, ఆచరించేవాళ్ళు కరువై పోతున్నారు. తక్షణం ఈ జ్ఞానాన్ని కనీసం గ్రంథస్తం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఆ తర్వాత దీనిని ఎలా వాడుకోవాలో తెలుసుకునేందుకు భవిష్యత్ తరాలకు అందజేసిన





వాళ్ళమవుతాం. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. నాకు మంచిదే అనిపిస్తోంది.

ఇక సంస్థాగతంగా ఆర్థిక సహాయం విషయానికి వస్తే నేను కొందరు బ్యాంకర్లతో సంప్రదించాను. వారి అభిప్రాయం ప్రకారం 'పల్లెసృజన' సహకార సంఘంగా ఏర్పడి దీనిని పొందవచ్చు. లేదా కొన్ని సంస్థలతో మాట్లాడి మార్కెటింగ్ సదుపాయం ఏర్పాటు చేసుకోవచ్చు. నిజం చెప్పాలంటే ఈ సమస్యకి ఎవ్వరి దగ్గరా పరిష్కారం లేదు. నేను వెతుకుతూనే ఉన్నాను. మంచి మార్గం దొరికితే మళ్ళీ చెప్తాను.

ఈ శోధయాత్రలో పాల్గొనడం నాకెంతో ఆనందాన్నిచ్చింది. జీవితాన్ని కొత్త కోణంలో చూడటం నేర్పించింది. వీరు చేస్తున్న మంచి పనులకి నేనేవిధంగా సహాయ పడగలనో అన్న విషయంపై తీవ్రంగా ఆలోచిస్తు న్నాను. ధన్యవాదాలు.

**డా. యస్. శ్రీధర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ & ప్రాజెక్ట్ లీడర్, కెమికల్ ఇంజనీరింగ్ డివిజన్, సిఎస్ఐఆర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్ :** మా బృందానికి 'పల్లెసృజన' నిర్వహించిన 19వ చిన్న శోధయాత్రలో పాల్గొనే అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. పల్లెసృజన కోరినట్లుగానే ఈ బృందం శోధయాత్రలో వివిధ ప్రాంతాల నుండి సేకరించిన 'నీటి' నమూనాలను మా పరిశోధనా శాలలో పరీక్షించి వివరాలు, సూచనలు అందజేస్తున్నాం. భవిష్యత్‌లో కూడా ఇటువంటి సహాయం చేయటానికి పల్లెసృజనకి కలుషితమైన నీటిని శుద్ధి చేసే విషయంలో చేదోడుగా ఉంటామని తెలియజేస్తున్నాం. ●

**అందరికీ సమానమైన ప్రతిభ ఉండకపోవచ్చు కానీ ప్రతిభను పెంచుకునే అవకాశాలు అందరికీ సమానమే.**



# రైతు నేస్తం, ప్రకృతి నేస్తం, ప్రజా నేస్తం
# కొమ్మూరి విజయ కుమార్

ప్రకృతి వ్యవసాయాన్ని సరికొత్త రీతిలో ప్రచారం చేసేందుకు ఒంటరి పోరాటం చేస్తున్న కడప జిల్లా, వేంపల్లె మండలం లోని టి.వి. పల్లె గ్రామానికి చెందిన కొమ్మూరి విజయ కుమార్ దేశ వ్యాప్తంగానే కాదు, బ్రెజిల్ లాంటి దేశాల నుండి కూడా ఎంతోమంది వ్యవసాయ అధికారుల, నాయకుల, రైతుల ప్రశంసలు అందుకుంటున్నారు. ఇతని 13వ యేటనే విద్యుదాఘాతం వల్ల ఇతని రెండు చేతుల వేళ్ళు వంకరగా మారిపోయిన వికలాంగుడు. ఇతనికి ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి. ఇతని భార్య కూడా వికలాంగురాలే. పెద్దబ్బాయి, మూడవ అబ్బాయి, భార్య విజయ కుమార్‌కు వ్యవసాయంలో సహకరిస్తుండగా, రెండవ అబ్బాయి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ వుంటాడు.

విజయ కుమార్ చిన్నప్పుడు తండాలలో తిరుగుతూ అక్కడి కమ్యూనిస్టులతో పాటు పాటలు పాడుతూ తిరిగే వాడు. ఇతని గాత్రం బాగుండటంతో వారు కూడా ఎక్కడికి వెళ్ళినా ఈయనచేత పాటలు పాడించే వారు. అలా కొన్నేళ్ళు గడిచాక, 1992లో సారా నిషేధ ఉద్యమంలో కడప జిల్లాలో ఉద్యమం కొనసాగించటంలో విజయ కుమార్ కూడా ప్రధాన వ్యక్తులలో ఒకరు. ఇతని గాత్రంలో పాటలు పాడి సారా వ్యతిరేక ఉద్యమానికి మంచి ఊపునందించాడు. ఆ తర్వాత కొంతకాలం వ్యవసాయ, పారిశ్రామిక కూలీల సంఘాలతో పరిచయం ఏర్పడి అలా లేబర్ యూనియన్ల వెంట కూడా ప్రచారం చేసుకుంటూ కొంతకాలం తిరిగాడు. ఇలా తిరుగుతున్న సమయంలో 'రాయలసీమ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ' వారు విజయ కుమార్ ఉద్యమ స్ఫూర్తిని, ఇతని గాత్రంతో ప్రజలను మైమరిపించే విధానాన్ని గుర్తించి, అటవీశాఖ వారు 'వన సంరక్షణ సమితి' ఏర్పాటు

మీ ప్రమేయం లేకుండా మీరు ఏదీ సాధించలేరు. మీ ప్రమేయమే ఉంటే ఎప్పటికీ ఓడిపోలేరు.

చేశారు నువ్వు అందులో పని చేస్తే నీకు ఉపయోగంగా వుంటుంది, సమాజానికి కూడా ఉపయోగ పడే పని అని విజయ కుమార్‌ను ప్రోత్సహించారు. అలా వన సంరక్షణ సమితిలో చెట్లు వాటి ఉపయోగాలపై ప్రచారం కల్పిస్తూ అక్కడే వుండి వివిధ గ్రామాలలో తిరుగుతూ ప్రచారం చేస్తుండేవాడు.

ఈ క్రమంలో మూలికా వైద్యులతో పరిచయాలు ఏర్పడ్డాయి. విజయ కుమార్ అమ్మ, నానమ్మలు కూడా ఆయుర్వేద వైద్యంలో కొంత పరిచయ వున్నవారు, కీళ్ళ నొప్పుల, చిన్న చిన్న రుగ్మతలకు ఆయుర్వేద వైద్యం చేస్తూ వుండేవారు కావటం వల్ల సహజంగానే ఆయుర్వేద వైద్యులతో చనువు, పరిచయాలు పెంపొందాయి. ఈయన చదివింది నాలుగో తరగతే అయినా తెలుగు పుస్తకాలను బాగా చదివే వాడు. నాడు ఆంధ్రజ్యోతిలో 'వంటింటి వైద్యం' అనే వ్యాసాలను క్రమం తప్పకుండా చదువుతూ, అందులో రోగాలకు ఉపయోగించే చెట్లను గురించి తెలుసుకుని, తన ప్రచారంలో ఈ చెట్ల వల్ల ఇలాంటి ఉపయోగాలుంటాయి అంటూ తన ప్రచారానికి కొత్త ఒరవడి దిద్దడం మొదలు పెట్టాడు. ఈయన ఒరవడి అటవీ శాఖ సిబ్బందిపై ఎంతటి ప్రభావాన్ని చూపిందంటే, ఎక్కడైనా అటవీ సంరక్షణ గురించి జరిగే సభలలో ఆ శాఖ సిబ్బంది వారే ఈ చెట్ల వల్ల ఎలాంటి ఉపయోగాలుంటాయో విజయ కుమార్ మీకు వివరిస్తాడు అని ఇతని చేత ఆ చెట్ల ఉపయోగాలను వివరిస్తూ ఉపన్యాసాలు ఇప్పించేవారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఒక అటవీ శాఖ అధికారి విజయ కుమార్ ప్రతిభను గుర్తించి ఈయనను తనతో పాటు తీసుకెళ్ళి మెదక్ ప్రాంతంలో చెట్ల పెంపకం వల్ల లాభాలు, వాటి ఉపయోగాలపై ప్రచారం చేయించాడు.

ఇలా వ్యవసాయం గురించి పెద్దగా అనుభవం, చెయ్యాలన్న ఉత్సాహం లేకపోయినా కడప సబ్ జైల్ వెనక వున్న ఒక పెద్ద అటవీ ప్రాంతాన్ని తీసివేసి, దాన్ని వ్యవసాయ యోగ్యంగా మార్చాలని నాటి కలెక్టర్ ఆదేశించటంతో దాన్ని వ్యతిరేకించేందుకు ఎంతో కృషి సలిపి, ఇంతటి అటవీ



ప్రాంతాన్ని సంరక్షించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. చెట్లు కొట్టకూడదు, చెట్లు పెంచాలి అని మీరే ప్రచారం చేస్తూ దాదాపు 300 ఎకరాకు పైగా వున్న అడవిని తీసివేయటం భావ్యం కాదని న్యాయ పోరాటం కూడా సలిపి మొత్తానికి ఆ అడవిని రక్షించ గలిగాడు.

అడవులపై డాక్యుమెంటరీలు తీస్తూ ప్రచారం సాగించే ఒక అధికారిణి ప్రోత్సాహంతో విజయ కుమార్ వ్యవసాయం వైపుకు అడుగులు వేశాడు. తనకున్న పొలంలో మొదట ఒక ఎకరాలో 'కొర్ర' సాగును చేపట్టాడు. అలా మొదలైన ఇతని వ్యవసాయ ప్రస్థానం జిల్లాలోనే కాదు రాష్ట్రంలో కూడా దాదాపు కొర్ర పంటను అందరూ మర్చిపోతున్న సమయంలో కొర్ర వెయ్యటం వల్ల ఉపయోగాలు, లాభాలను రైతులకు తెలియజేసే కార్యక్రమం చేపట్టి ఇప్పుడు జిల్లాలో 1600 కు పైగా ఎకరాల్లో రైతులు కొర్ర సాగు చేపట్టేలా చేశాడు. విత్తనం కొర్రలు కావాలన్న రైతులకు ఈయనే ఇచ్చేవాడు, వారు దానికి ప్రతిఫలం ఇచ్చినా, ఇవ్వకున్నా తాను మాత్రం విత్తనం తప్పకుండా ఇచ్చేవాడు. దాని సాగును కావలసిన అన్ని రకాల సూచనలు చేస్తూ అవసరమైతే వారి పొలాలకు వెళ్ళి చూసి వచ్చేవాడు.

అలా మొదలైన ప్రస్థానంలో అధికారులు ఇతనికి తోడ్పడి ఇతనిచేత "వెన్నెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ" (వి.ఆర్.డి.ఎస్.) అనే ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేయించి, ఇతని క్రింద నలుగురు వ్యక్తులు ప్రచార నిమిత్తం

**మీరు మీ కర్తవ్యానికి సెల్యూట్ చేస్తే ఇంకెవరికీ సెల్యూట్ చెయ్యవలసిన అవసరం లేదు. కానీ మీరు మీ కర్తవ్యాన్ని పొల్యూట్ చేస్తే అందరికీ సెల్యూట్ చెయ్యాల్సి వస్తుంది.**

పని చేసే ఏర్పాటు చేయటంతో చిరు ధాన్యాల సాగు, రసాయన మందులు, ఎరువులను మానివేయటం, ప్రకృతి సేద్యాన్ని చేయటం వల్ల కలిగే లాభాలు, సమాజానికి ఎంతగా ఉపయోగ పడుతున్నామో లాంటి ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటూ, ప్రతి రైతుకు అందుబాటులో వుండేలా సెల్ ఫోన్ పైన కూడా సలహాలిస్తూ అద్భుతమైన పోరాట పటిమను కనబరుస్తున్నాడు విజయ కుమార్.

తనకున్న ఆయుర్వేద పరిజ్ఞానంతో ఆ ఆగులతోనే కొత్త కొత్త ద్రావణాలను తయారు చేసి, వాటిని పంటలపై ప్రయోగాలు చేసిన తర్వాత అవి విజయవంతమైనప్పుడు రైతులకు అందించి, వాటిని తయారు చేసుకునే విధానాన్ని తెలిపేవాడు, చేసుకోలేని వారికి ఇతనే ఆ ద్రావణాన్ని సరఫరా చేస్తూ ప్రకృతి వ్యవసాయానికి ఎంతో తోడ్పాటు, చేయూతను అందిస్తున్నాడు విజయ కుమార్. ఇప్పుడు ఇతని వద్ద కొన్ని వేల లీటర్ల ద్రావణాలు సిద్ధంగా ఉంటాయి. ఈ అనుభవం ఏ స్థాయికి వెళ్ళిందంటే పెద్ద పెద్ద రిటైర్డ్ అధికారులకే వ్యవసాయం గురించిన పాఠాలు చెప్పే స్థాయికి చేరుకున్నాడు విజయ కుమార్. 2007లో ప్రారంభమైన ఈ ప్రస్థానం దినదిన ప్రవర్ధమానం చెందుతూ వస్తున్నాడు విజయ కుమార్.

2007లో పాలేకర్ వ్యవసాయ శిక్షణా తరగతులకు హాజరయ్యేందుకు వెళ్ళగా అక్కడ శిక్షణా తరగతులలో పాల్గొనేందుకు ప్రవేశ రుసుము చెల్లించాలనటంతో తనవద్ద డబ్బు లేదని వున్న కొద్దిపాటి డబ్బుతో అక్కడ కొన్ని పుస్తకాలను కొనుగోలు చేసి, వాటి ఆధారంతో తనకున్న ఆయుర్వేద పరిజ్ఞానాన్ని జోడించి తనను ఈ వ్యవసాయ రంగంలోకి తీసుకు వచ్చిన 'రవి' అనే వ్యక్తి చెప్పినట్లుగా వ్యవసాయంలో సరికొత్త పోకడలకు రూపమిచ్చాడు విజయ కుమార్. ఇక్కడ విజయ కుమార్ ప్రతిభ ఏమిటంటే పాలేకర్ గారు చెప్పే వ్యవసాయం చాలా మంచిదే కానీ, అది అన్ని ప్రాంతాలకు వర్తించదు. భూమి స్వభావాన్ని బట్టి వ్యవసాయ విధానాల్లో మార్పు ఉంటుందని గ్రహించి ఆయా ప్రాంతాల లో భూమికి అనుగుణంగా వ్యవసాయం చేయాలి అన్న సూత్రాన్ని కనుగొనడం ఇతని ప్రత్యేకత. వయసు మీరిన రైతులతో మమేకమై నాటి వ్యవసాయ విధానాలను ప్రస్తుత రైతాంగానికి అన్వయించి సరికొత్త వ్యవసాయ విధానాలను ప్రచారం చేస్తున్నాడు విజయ కుమార్. సరియైన కార్తులలో ఆయా పంటలు వేస్తే పురుగు ఉధృతి తక్కువ, పంట దిగుబడులు బాగా వస్తాయి అని, ప్రస్తుతం రైతులు ఎప్పుడు పడితే అప్పుడు తమకు తోచినట్లుగా పంటలను వేయటం వల్ల పురుగుల ఉధృతి ఎక్కువ, పంటల దిగుబడి తక్కువ, పురుగు మందుల ఖర్చులు మాత్రం అధికంగా ఉండటమే కాదు, విషతుల్యమైన ఆహారాన్ని సమాజానికి అందిస్తున్నామని అంటాడు. విషతుల్యమైన ఆహారాన్ని సమాజానికి అందించటమంటే 'టెర్రరిజానికి మించిన ద్రోహం' అని నిర్మొహమాటంగా చెప్తాడు విజయ కుమార్.



పల్లెల విధానాలే సరైనవని, కోడి, కుక్క, గొర్రె, మేక, ఆవులు గ్రామాల్లో పెరిగినప్పుడే వ్యవసాయం ఇంకా అభివృద్ధి చెందుతుంది అంటాడు. వ్యవసాయంలో మన పూర్వీకులదే సరియైన విధానమని, ప్రస్తుత శాస్త్ర సాంకేతిక విధానం కన్నా కొన్ని వందల రెట్లు మన పూర్వీకుల వ్యవసాయ విధానాలే సరైనవి అంటారీయన. ఆధునీకరణ మోజులో పడిన గ్రామీణ రైతాంగం కోళ్ళను పెంచితే ఇల్లంతా పెంట వేస్తాయని వాటిని పెంచటం మానేయటం, పశువులు వుంటే వాటి మూత్రంతో ఇళ్ళంతా వాసన అనే ఏహ్య భావంతో వాటిని పెంచటం మానేశారు. 2007లో నేను గ్రామాలకు తిరిగేటప్పుడు గ్రామానికి 6-10 మందే

**కేవలం విజయగాథలు చదివితే వివరాలు మాత్రమే తెలుస్తాయి. అదే అపజయాల కథలు చదివితే విజయాలకి మార్గం దొరుకుతుంది.**

రోగ గ్రస్తులు ఉండేవారని, 2016లో అవే గ్రామాలు తిరుగుతుంటే ఇప్పుడు వారి సంఖ్య 60–70కి పెరిగిందని వీటన్నిటికి మూల కారణం ప్రకృతిని మరచి రసాయనాల వెంట పడటమే ప్రధాన కారణమంటాడు విజయ కుమార్.

నేను సారా ఉద్యమ యాత్రలు చేశాను, పర్యావరణ పరిరక్షణ యాత్రలు, జలయజ్ఞం యాత్రలు లాంటివెన్నో చేశాను కానీ 'పల్లెసృజన' చేస్తున్న 'శోధయాత్ర' మాత్రం నా మనసును కదిలించింది అంటారు విజయ కుమార్. గ్రామాలతో ఎటువంటి సంబంధం లేని యువకులను, విద్యార్థులను గ్రామాలలో నడుస్తూ తిరిగేలా చేసి, గ్రామీణ వయో వృద్ధులను కలిసి వారి జ్ఞానాన్ని సేకరించి, వారిని సన్మానించటం, వారి జీవన శైలిని గ్రంథస్తం చేయటం చూస్తే భవిష్యత్ తరాలకు ఎంతమంచి పునాది వేస్తున్న 'పల్లెసృజన'ను నేనెన్నటికీ మరవలేను అంటారీయన. 'పల్లెసృజన' స్ఫూర్తితో తాను కూడా యువకులను సేకరించి వారికి వ్యవసాయంలో శిక్షణనిస్తున్నాడు. కర్నాటకలోని హొస్పేట్‌లో తన స్వచ్ఛంద సంస్థ ద్వారా శిక్షణ పొందుతున్న యువకులు ఇప్పుడు తాము ఇక ఉద్యోగాల వేటలో పడకుండా ప్రకృతి సేద్యం చేస్తూ సమాజానికి మంచి ఆహార పదార్థాలను అందిస్తామని అంటున్నారంటే ఇతను నింపిన స్ఫూర్తి ఆ యువతలో ఎంతగా నాటుకు పోయిందో అర్థం చేసుకోవచ్చు.

ప్రతి గ్రామంలో రైతు విత్తనం కొనకుండా వారే తయారు చేసుకునేలా చేయటమే తన జీవిత లక్ష్యమని, తాను చనిపోయే లోపల గ్రామాల్లో రైతులు విత్తనం కొనకుండా, తమ విత్తనాలను తామే తయారు చేసుకునేలా చేస్తానని ఉద్వేగంగా అంటాడు విజయ కుమార్. అందుకే ఇతను తనవద్ద వున్న తొమ్మిది రకాల విత్తనాలతో కూడిన ఒక ప్యాకెట్‌ను తనవద్దకు వచ్చిన ప్రతి వ్యక్తికి అందిస్తాడు. రైతైతే వాటిని విత్తనం వేసుకుంటాడు, రైతు కానివాడు కనీసం ఒక నెల రోజుల పాటు ఈ కల్మషం లేని ఆహారం తిని, ఇలాంటిది మనమెందుకు చేయకూడదని ఆలోచిస్తాడు అంటారీయన. దీని ద్వారా మీరు సాగు చేసి, మీరు కూడా మీ తోటి రైతులకు ఇలా విత్తనాలను ఇవ్వండి, ఇక భవిష్యత్తులో విత్తనాలు కొనటానికి పట్టణాల వెంట రైతులు వెళ్ళరు. తద్వారా



ఆరోగ్యవంతమైన ఆహారాన్ని సమాజానికి మనం అందించిన వారమవుతామంటారీయన. ఎంతటి స్ఫూర్తి!

మనిషికి తప్పనిసరిగా అవసరమైనది భోజనం. ఆ భోజనం విష ప్రభావం కాకుండా చూడాల్సిన ధర్మం రైతుది. రైతే రాజు, రైతే దేశానికి వెన్నెముక అంటారు. మరి అలాంటి రైతే దేశానికి విషాన్నం పెడితే ఇంతకన్నా పాపం ఏమైనా వుందా? అంటారీయన. మాఫియా విశ్వంలోని కొంత మందికే నష్టం చేస్తుంది. కానీ, విషాహారం తయారు చేయటం వల్ల యావత్ మానవ జాతికే కాదు, పక్షులు, పశువులకు కూడా విషాహారం అందిస్తున్నారు. ఇంతటి పాపాన్ని రైతు మూటగట్టుకోవటం తనను వేధిస్తోంది అంటారు విజయకుమార్. ఈ రైతులే విషాహారం తయారు చేస్తుంటే, అగ్నికి ఆజ్యం పోసినట్టు, వ్యాపారులు కూడా వాటిని వినియోగ దారులకు ఆకర్షణీయంగా కనబడాలని ఇంకాస్త విష రసాయనాలను వాటిపై రుద్ది ఇంకా ద్రోహం తలపెడుతున్నారు అని వాపోయారు విజయ కుమార్.

రైతు వ్యాపార ధోరణిలో ఆలోచించకుండా ముందు వ్యవసాయం చెయ్యాలి. మనమే విషాహారం తింటుంటే, మన భవిష్యత్ తరాల వారు పుట్టుకతోనే రోగగ్రస్తులుగా మారే అవకాశాన్ని మనమివ్వకూడదు. సంవత్సరానికి రెండు పంటలు పండించాలి. అవి ఆహార ధాన్యాలే కావాలి. చిరు ధాన్యాలు, కందులు, పెసలు, జొన్నలు లాంటివి మిశ్రమ పంటల రూపంలో పండించాలి. ఇవే అమ్ముకుంటే కావాల్సినంత డబ్బు వస్తుంది. వీటికి ప్రకృతిపరంగా



పురుగులు, జబ్బులను ఎదుర్కోవాలే తప్ప, రసాయనాల జోలికి వెళ్లకూడదు, అంతే కాదు, ప్రతి రైతు పాడి పశువులు, ఆవులను పెంచుకోవాలి. వాటి పునరుత్పత్తి ఇంజక్షన్ల ద్వారా కాకుండా ప్రకృతి సహజంగా కోడెలు, దున్నలతో ప్రత్యుత్పత్తి జరిగేలా చేయండి. మన నెత్తిపైన రుద్దిన విష సంస్కృతిని విడనాడండి. ఇప్పటికే బహుళజాతి సంస్థల మాయలో పడి మనం పరాన్న జీవులుగా మారిపోయాం. స్వయం పోషకులుగా మారవలసిన ఆవశ్యకత భవిష్యత్తులో పిల్లలకు పశువులను 'గూగుల్' (ఇంటర్‌నెట్)లో చూపించే దౌర్భాగ్యపు పరిస్థితి రానీయకుండా చేయండి. మన పిల్లలకు ఇదిగో ఇది ఆవు, ఇది గేదె, ఈ మొక్క పేరిది, ఈ పంట పేరిది అంటూ చూపించండి. వారి జ్ఞానం ఇంకా వృద్ధి పొందుతుంది. పిల్లలు ప్రత్యక్షంగా చూస్తే అది మెదడులో నిక్షిప్తమై పోతుంది. ఇంటర్‌నెట్‌లో చూస్తే జ్ఞాపకాలు ఎక్కువ కాలం ఉండవు అంటారీయన.

జులై నుంచి ఆగస్టు వరకు వర్షాధారంగా చిరు ధాన్యాలు విత్తుకోవాలి, అక్టోబర్ నెల ఏ పంటకు అనువు కాదు, నవంబర్, డిసెంబర్ లలో పెసలు, శనగలు, జొన్న, కుసుమ, ధనియాలు, నువ్వులు లాంటివి సాగు చేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో వీటికి మంచి గిరాకీ ఉంది, ఉంటుంది కూడా ఎందుకంటే ఇవి ప్రతి మనిషికి అవసరం కనుక అంటాడు విజయ కుమార్. హైబ్రిడ్ విత్తనాలకు వెళ్ళేకొద్దీ అనర్థమే తప్ప రైతుకు ఒరిగేదేమీ లేదని, మన విత్తనాలను మనం సేకరించుకుంటేనే ఆరోగ్యకరమైన పంటలు, తక్కువ తెగుళ్ళు, తక్కువ పురుగు మందుల అవసరమౌతుంది అంటారు. వేలకు వేలు రసాయన మందులు పిచికారి చేసే బదులు, కొద్దిగా కష్టపడి ప్రకృతి పరమైన ఆకు కషాయాల మందులనే పిచికారి చేసుకోవటం మంచిది అంటారు.

ద్రావణాల విషయానికి వస్తే నేను చేస్తున్న ద్రావణాలలో ఉత్తమమైనది 'వెర్రిపుచ్చ' మరియు 'నల్లేరు' ద్రావణం ఎంతో ఉపయుక్తమైనది అంటారీయన. వీటి ద్రావణం తయారు చేసుకోవటానికి 200 వందల లీటర్ల నీటిలో 10 కిలోల వెర్రిపుచ్చ కాయలు, ముదురు నల్లేరు ఆకులను కాండంతో సహా 10 కిలోలు తీసుకోవాలి. ఈ నల్లేరు పొలం గట్లపైన, అడవుల్లో, చెట్లను చుట్టుకుని పెరుగే తీగ జాతి మొక్క. ఈ ఆకుల రసం మన శరీరం పై తగిలినా జిల వస్తుంది. ఈ రెండింటినీ కచకచ్చగా దంచి ఆ నీటిలో వేయాలి. ఆరు రోజుల పాటు రోజూ కలియబెడుతూ వుండాలి. వెర్రిపుచ్చకాయలు చేదు విషం, నల్లేరు జిల వచ్చే గుణం. ఈ రెండు కలియడం వలన చేదు తిన్న పురుగులు క్రింద పడతాయి, నల్లేరు మూలంగా శరీరంపై జిల పుట్టి పురుగులు తనకలాడి చనిపోతాయి. కూరగాయల పంటలపై ఒక పిచికారి డ్రమ్ముకు (15 లీటర్లకు) అర లీటరు ద్రావణం, వరి, ఇతర పంటలపై డ్రమ్ముకు ఒక లీటరు చొప్పున కలిపి పిచికారి చేస్తే ఎటువంటి పురుగైనా చనిపోతుంది. అయితే ఈ ద్రావణాన్ని వారం పది రోజుల వ్యవధి ఇస్తూ మూడు పర్యాయాలు తప్పకుండా స్ప్రే చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే ప్రతి డ్రమ్ముకు అర లీటరు గోమూత్రం కలిపి పిచికారి చేస్తే ఎంతో సమర్థవంతంగా పని చేస్తుంది అంటాడు విజయ కుమార్. ఈ ద్రావణాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో కూడా విరివిగా వినియోగిస్తున్నారు.

చాలామంది రైతులు తమ పొలాల్లోని 'నిధి'ని దుర్వినియోగం చేసుకుంటున్నాడు అంటాడు విజయ కుమార్. ప్రత్తి, మిరప, ఎన్నో రకాల కూరగాయలు లాంటి ఎన్నో పంటలు పండించిన తర్వాత వాటి ఉత్పత్తులను తీసుకుని, విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కానీ వాటి

**ప్రేమించటానికి ఈ జీవితకాలం సరిపోదు. మరి ద్వేషించటానికి మనుషులకి సమయం ఎక్కడ్నించి వస్తుందో?**



పంట కాలం పూర్తయిన తర్వాత చెట్లను తీసివేసి బయట పారవేయటమో లేదా వంట చెరుకుగా ఉపయోగించు కోవటమో చేస్తున్నారు. ఇలా చేయటం వల్ల ఉచితంగా వచ్చే దాదాపు కొన్ని టన్నుల ఎరువును పోగొట్టుకుంటున్నారు. ఈ మొక్కలను వీలైతే చిన్న చిన్న ముక్కలుగా చేసి, లేదా అలాగే ఒక దిబ్బలో వేసి, వాటిపై ఎరువు, పశువుల మూత్రం (రొచ్చు), నీరు పోస్తూ వుంటే మళ్ళీ పంటలు వేసుకునే కాలానికి అవి కుళ్ళి అత్యంత పోషక విలువలు కలిగిన ఎరువుగా తయారవుతుంది అన్న విషయాన్ని మర్చిపోతున్నారు. వేరుశనగ విత్తనాలు వలిచిన తర్వాత ఆ పొట్టును చాలామంది పారవేస్తారు. కానీ, అందులో ఎంతో ఉపయుక్తమైన గుణాలుంటాయి అంటారు. చిరుధాన్యాల తీగలు, ఆకులు చౌడు నేలలను కూడా సారవంతంగా మార్చే శక్తి కలవి వీటిని పారవేయకండి, మురగబెట్టి పొలాలకు ఎరువుగా వాడుకోండి అంటారు. చాలామంది రైతులు జొన్న, మొక్కజొన్న కోసిన తర్వాత ఆ మేతను పశువులకు వినియోగించుకుంటున్నారు కానీ, పొలంలో వున్న కొయ్యలను కూలీలు పెట్టి ఏరించి మరీ కాల్చివేస్తున్నారు. ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం టిల్లర్, రొటోవేటర్ లను పొలంలో తిప్పినట్లయితే అవి చిన్న చిన్న ముక్కలై ఎరువుగా మారి, పొలానికి మంచి పోషకాలను అందిస్తాయి. కాబట్టి వాటిని వృధాగా పోనివ్వకండి, మన సారవంతమైన ఎరువును పారవేసుకుని, సమాజానికి కీడు చేసే ఎరువులను కొని తెచ్చుకోకండి అంటున్నాడు విజయ కుమార్. మనం పండించే పంటలలో వృధా అనేది లేనేలేదు వీటిని పారవేయకుండా భూమికి అందిస్తే ప్రతి భూమి సారవంతంగా తయారౌతుంది అంటారు.

మానవుని పుట్టుకతోనే వ్యవసాయం ఏర్పడింది. ఏది లేకపోయినా మనం బ్రతకగలం, కానీ అన్నం లేకుండా బ్రతకలేము అన్న విషయాన్ని మర్చిపోతున్నారు. రైతులు కూడా ఒక ఎకరంలో లక్షల రూపాయలు వెంటనే రావాలి అన్న ఆతృతలో రసాయనాలు వాడటం ద్వారా ఎక్కువ ఆదాయం తీసుకోవచ్చు అనుకుంటున్నాడు. కానీ అదే సమయంలో సమాజానికి ఎంత చెడుపు చేస్తున్నాము అన్న విషయాన్ని మర్చిపోతున్నాడు. గ్రామీణులంతా పట్టణ వాతావరణానికి అలవాటు పడిపోవటము, తమ పిల్లలను ఊర్లో చదివించకుండా ఇంగ్లీషు చదువులంటూ పట్టణాలలో వేలు, లక్షలు పెట్టి చదివించుకోవటం మూలంగా ఖర్చులు పెరిగిపోయి ఆ ఖర్చులను ఎలా తట్టుకోవాలో తెలియక భూమిని పీల్చి పిప్పి చేసే రసాయనాలు వేసి, తాము నష్టపోతూ, భూమిని కూడా నిస్సారంగా తయారు చేస్తున్నారు. ఆ గ్రామంలోని రైతులంతా తలుచుకుంటే ఊర్లోని పాఠశాల ఉపాధ్యాయుడే సరియైన చదువు చెప్పగలడు. అలా ఖర్చులు తగ్గించుకుని, మంచి, ఆరోగ్య కరమైన పంటలు పండించాలి కాని, మితిమీరిన ఖర్చులకు పోయి భూమిని, సమాజాన్ని పాడు చేయటం సరికాదు అంటారీయన.

తాను, తన భార్య వికలాంగులైనా సమాజం పట్ల వీరికున్న ప్రేమను, సమాజానికి ఆరోగ్యాన్ని అందించాలి, పర్యావరణాన్ని కాపాడుకోవాలి అంటూ ఎక్కడికి పిలిస్తే అక్కడికి వెళ్ళి తన సలహాలు, సూచనలు, శిక్షణలు ఇస్తూ దాదాపు దక్షిణ భారత దేశమంతటా తిరుగుతున్న విజయ కుమార్ కృషిని మనమందరం అభినందించాలి, ఆచరించాలి. అదే ఆయన చేస్తున్న కృషికి మనమిచ్చే గౌరవం, ప్రతిఫలం. మీ గ్రామాల్లో వీరిచేత శిక్షణా తరగతులు నిర్వహించాలనుకున్నవారు సంప్రదించవలసిన చిరునామా : **కొమ్మూరి విజయ కుమార్, విఆర్‌డిఎస్, టి.వి. పల్లె పోస్ట్ & గ్రా., వయా తాళ్ళపల్లె, వేంపల్లె మండలం, కడప జిల్లా. -516 350. ఫోన్ : 9849648498**

●

**చేతకాదని ఎప్పుడూ చేతులెత్తేయకూడదు. సమస్యలు మనల్ని ఓడించనీయకూడదు.**

## స్పందన

**బ్రిగేడియర్ గారికి,** నా పొలంలో వున్న బోరు బావికి స్కానింగ్ సేవల అవసరం ఏర్పడింది. ఈ విషయంలో మీ దృష్టికి వచ్చిన స్కానింగ్ సేవలను అందించే వ్యక్తి/ సంస్థ వివరాలు తెలుపగలరు. **– రవి రెడ్డి**

**రవిరెడ్డి గారికి,** మీ సమస్య తెలిసింది. దీనికి కర్నాటకకు చెందిన శ్రీ గిరీష్ అనే ఇన్నోవేటర్ వద్ద సమాధానం ఉందని భావిస్తున్నాము. అతని సెల్ నెంబరు : 9902133996. అతనిని ఎన్.ఐ.ఎఫ్.కు పరిచయం చేసిన వినోద్ కుమార్ గారి దృష్టికి కూడా మీ సమస్య తీసుకు వెళ్ళటం జరిగింది. మంచి సమన్వయం కోసం ఆయన సహాయం కూడా మీరు పొందవచ్చు. వినోద్ గారి ఫోన్ నెంబరు : 9483421285. ఈ విషయంలో 'సెప్టెంబర్–అక్టోబర్ 2014 పల్లెసృజన' పత్రికలో గిరీష్ గారి ఇన్నోవేషన్ గురించి వ్రాసిన వివరాలు చదవండి. మీ పని పూర్తయిన తర్వాత మీ అనుభవాలను 'పల్లెసృజన'తో, ఇన్నోవేటర్‌తో పంచుకుంటారని ఆశిస్తున్నాం.

**– బ్రిగేడియర్ పోగుల గణేశం**

**రాఘవరెడ్డి గారికి,** మా గ్రామం సమీపంలోని కొందరు మిత్రులు సృజనాత్మకంగా సేంద్రియ వ్యవసాయాన్ని చేస్తూ సమీప గ్రామస్తులలో ఎంతో ఉత్సాహాన్ని నింపుతున్నారు. 'పల్లెసృజన' బృందం ఒకసారి మా గ్రామాన్ని సందర్శిస్తే బావుంటుందని ఆశిస్తున్నాము. **– రమణారెడ్డి,** ధర్మవరం, అనంతపురం జిల్లా.

రమణారెడ్డి గారికి, మీ ఆహ్వానానికి కృతజ్ఞులం. తప్పక మీ మిత్ర బృందాన్ని త్వరలో కలవడానికి పూర్తి ప్రయత్నం చేస్తాం. **– వీర రాఘవ రెడ్డి**

**గణేశం గారికి,** సాదర నమస్కారములు. మే–జూన్–2016 'పల్లెసృజన' సంచిక చూశాను. 22వ పేజీలో ప్రోత్సాహక బహుమతిగా 'బిల్వ కాయలను వలిచే యంత్రం' విశేషాలను చదివాను. అది "బిల్వ కాయలు" కాదు. బిలావా కాయలు. ఇది హిందీ పదం. అంటే 'నల్ల జీడి గింజ'. బిల్వ అంటే మారేడు కాయ నుండి నూనె రాదు, పొక్కదు. ఆ గుణం నల్లజీడి గింజకే ఉంది. గమనించ గలరు.

**– వైద్య పమ్మి సత్యనారాయణ శాస్త్రి, విజయవాడ.**

**శ్రీ సత్యనారాయణ శాస్త్రి గారికి,** మీరు అందించిన సూచనకు ధన్యవాదములు. మా జ్ఞాన లోపాన్ని పూర్తి చేసినందుకు నమస్సులు. ఈ సంచికలో మీరు సూచించిన సవరణ వివరాలను పాఠకులకు అందించాము. **–బ్రిగేడియర్ పోగుల గణేశం.**


### FORM IV

**PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC**

| | | |
|---|---|---|
| 1. | Place of publication | : Ranga Reddy Dist |
| 2. | Periodicity of its publication | : Bi-Monthly |
| 3. | Printer's Name | : Narendra Grafix |
| | Nationality | : Indian |
| | Address | : 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. | Publisher's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. | Editor's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher


ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.

# రైతులకోసం రైతులు కనిపెట్టిన సేంద్రియ క్రిమి సంహారక మందులు

## తులసి

పంటల ఎదుగుదలకు,
వైరస్ నివారణకు
సేంద్రియ మందు
కావలసిన వారు సంప్రదించవలసిన ఫోన్
**9985758013**




## పర్ఫెక్ట్

వరిలో సుడిదోమ
పత్తి, మిరప, ఇతర కూరగాయ
పంటలను ఆశించే రసం పీల్చే పురుగు,
తెల్లదోమ, పచ్చదోమ, పిండినల్లి
మొదలైన వాటిని
సమర్థవంతంగా నివారిస్తుంది
కావలసిన వారు సంప్రదించవలసిన ఫోన్
**9985758013**




సృష్టి
## కృషక్

పంటల
ఎదుగుదలకు,
ఆకుముడత తెగులు
నివారణకు
సేంద్రియ మందు




సృష్టి
## సుదర్శన్

పంటల
ఎదుగుదలకు,
కూరగాయల పంటలలో
పురుగుల నివారణకు
సేంద్రియ మందు



సృష్టి
## సర్వత్ర

పంటల ఎదుగుదలకు,
రసం పీల్చే పురుగు
నివారణకు
సేంద్రియ మందు




సృష్టి
## ప్రహార్

పంటల ఎదుగుదలకు,
పిండినల్లి
నివారణకు
సేంద్రియ మందు




సృష్టి
## ప్రయాస్

పంటల ఎదుగుదలకు,
పూత రాలుట
నివారణకు
సేంద్రియ మందు




సృష్టి
## శక్తి

పంటల ఎదుగుదలకు
సేంద్రియ మందు



సృష్టి
## శస్త్ర

పంటల ఎదుగుదలకు,
తామర పురుగు, తెల్లదోమ,
శనగపచ్చ పురుగుల
నివారణకు సేంద్రియ మందు




సృష్టి
## కె&సి

పంటల ఎదుగుదలకు,
బ్యాక్టీరియా, ఫంగస్
నివారణకు
సేంద్రియ మందు




సృష్టి
## సురక్ష

పంటల ఎదుగుదలకు,
చెదల నివారణకు
సేంద్రియ మందు



సృష్టి
## రక్షక్

పంటల ఎదుగుదలకు,
పత్తి పంటలో
పురుగుల నివారణకు
సేంద్రియ మందు




పశువైద్యంలో
పేరెన్నికగన్న
అనంతపురం
జిల్లా వాసి
బోయ పెద్దరాజన్న
తయారు చేసిన
పశువుల మందు

పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం

## 'పొదుగువాపు' వ్యాధి మందు



ప్యాకెట్‌లోని సగం పొడిని
వేడినీటిలో కలిపి
వాచిన పొదుగుకు పట్టించాలి.
రెండురోజులు వరుసగా
పొదుగుకు పట్టించినచో
పొదుగు మామూలుగా మారి
పాలు పితకడానికి వీలవుతుంది.

మీ అభిప్రాయాలను మాకు తెలపండి

## క్రియేటివ్ మైండ్స్

ఫోన్ : 040-ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com

కావలసిన వారు
సంప్రదించవలసిన చిరునామా :
**పల్లెసృజన**
ఇంటి నెం. 67,
వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500094.
ఫోన్ : 040-27111959,

PALLESRUJANA Telugu Bi-monthly 20/- July - August 2016 RNI No. APTEL 12136/01/01/2011-TC

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30 /-లు మాత్రమే



**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

Nagendra Gr